
గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మే2017
# కథలు




స్నాతక వ్రతం పూర్తయింది . పెళ్లికొడుకు చేతికి పసుపు గావంచా లో కట్టిన బియ్యం మూట , చేతికర్ర యిచ్చి కాళ్లకి పాంకోళ్ళు కట్టించి , రంగు కాయితాలతో అలంకరించిన గొడుగు తెరచి పట్టుకోమని " బావమరుదిని రమ్మనండి కాశీ ప్రయాణానికి పెళ్లికొడుకు బయలు దేరేడు " అన్నాడు పురోహితుడు .

అప్పుడే పీటలమీంచి లేచిన రాధాకృష్ణ మీద పడ్డ అక్షింతలను దులుపు కుంటూ కాశీయాత్ర కెళ్తున్న కొడుకు వెనకాలే నడవబోయేడు .

" బావా పెళ్లి నీదికాదు , కాబట్టి కాశీ యాత్ర కూడా నీది కాదుగానీ యిలారా , మా అక్క చూస్తే ఉతికి ఆరేసిగలదు " మేనమామ కొడుకు మేలమాడేడు .

" సార్ మీరు పెళ్లికొడుకుని కవర్ చేస్తున్నారు , లేడీస్ ఫంక్షన్ కదా , మీరు తప్పుకోండి సార్ ప్లీజ్ " అన్న ఫోటో గ్రాఫర్ మాటతో అక్కడ నుంచి తప్పుకోవలసి వచ్చింది రాధాకృష్ణ కి .

కాళ్లల్లో పడుతున్న పంచని జాగ్రత్తగా యెత్తి పట్టుకొని మంటపానికి యెదురుగా వేసిన కుర్చీలో చతికిలబడ్డాడు . తనకి జ్ఞానం వచ్చినప్పటినుంచి ప్రతీ పెళ్లిలోనూ ఈ కాశీ యాత్ర చూస్తున్నాడు . పెళ్లికొడుకు పట్టుకొనే మూట తప్ప అన్నీ మారిపోయాయి . అసలు పెళ్లి స్వరూపమే మారిపోయింది . సినిమాలలో చూపించే పెళ్లిలా వుంటోంది తప్ప నిజం పెళ్లిలా వుండటం లేదు . పెళ్లి కొచ్చేవారికి తెచ్చిన ప్యాకెట్ కొత్తదంపతుల చేతుల్లో పెట్టి వారిచ్చే ప్యాకెట్ పుచ్చుకోడం , ప్యాకెట్ల మార్పిడి మధ్యలో భోజనాలు కానిచ్చి యింటికి వెళ్లిపోవడం తప్ప పెళ్లి చూడాలనే ఆసక్తి యెవరిలోనూ వుండటం లేదు . ఆసక్తి వున్న రాధాకృష్ణ లాంటివారికి మండపాన్ని చుట్టుముట్టే ఫొటోగ్రాఫర్లు యేమీ కనబడనివ్వకుండా చెయ్యడం పరిపాటి అయింది .

రాధాకృష్ణ యే పెళ్లికి వెళ్లినా పెళ్లి అయేంతవరకు కళ్యాణమండపం లో కుర్చీకి అంటుకు పోయినట్టు కూర్చోడం , తన ఆరవయేట జరిగిన పెద్దక్కయ్య పెళ్లిని కళ్ల యెదుట వూహించుకొని ఆ జ్ఞాపకాలలో మునిగి పోవడం అలవాటు .

యెప్పడో యాభైయేళ్ల కిందట జరిగిన అక్కయ్య పెళ్లి యివాళో నిన్నో జరిగినట్టుంటుంది రాధాకృష్ణ కి . అక్కయ్య పెళ్లిలో జరిగిన ప్రతీ చిన్న సంఘటనా తనకి బాగా గుర్తు .

అంతెందుకు కాశీయాత్ర కి బావగారు సిద్ధంగా నిలబడ్డప్పుడు పురోహితుడు చెప్పమన్న మాటలను పెద్దగా అరచి చెప్పడం , అందరికీ వినబడేటట్టు చెప్పినందుకు రెండు వరహాలకి బోనసు మరో రెండురూపాయలు కలిపి మావయ్యగారు పది రూపాయలు తనకు యిస్తున్నట్టుగా ప్రకటించి కొత్త పదిరూపాయలనోటు తన చేతిలో పెట్టటం ,ఆ కొత్త పదిరూపాయలనోటు ని చేతితో తాకినప్పుడు కలిగిన పులకింత మొదటిరాత్రి భార్యని తాకినప్పుడు కూడా కలుగలేదు . ఆకొత్త పదిరూపాయలనోటు యిచ్చిన తృప్తి ఉద్యోగంలో నెలకి లక్ష రూపాయల జీతం పుచ్చుకున్నప్పుడు కూడా కలగలేదు .

ఆ బోనసు రెండు రూపాయలు తనను ముప్ప తిప్పలు పెడుతుందని అప్పుడు తెలిస్తే రెండువరహాలతో సరిపుచ్చుకొని ఆ రెండు రూపాయలని తిరస్కరించేవాడు . ఆరెండు రూపాయలు వారం రోజులు తనను నిద్రపోనివ్వకుండా చేసింది , ఆ రెండు రూపాయలు రెండువేల రైళ్లని తనగుండెలలో పరుగెత్తించింది .

యిప్పుడు నవ్వొస్తుంది కాని అప్పుడు ......

జ్ఞాపకాల పొరలలోకి జారిపోయేడు రాధాకృష్ణ . అక్కయ్య పెళ్లికి ముహూర్తాలు పెట్టిన దగ్గరనుంచి కాశీయాత్ర లో తనకెంత యిస్తారు , దానిని యెలా ఖర్చు చెయ్యాలి అనేదే తన ఆలోచన . తనకంటె పదేళ్లు పెద్దయిన పెదనాన్న కొడుకు హరన్నయ్య తన కంటికి హీరో . తన సందేహాలని తీర్చుకోవలన్నా , సలహాలు అడగాలన్నా అతడే అందుబాటులో వుండే వాడు .

హరన్నయ్య చెప్పిందాని ప్రకారం కాశీ యాత్రకి రెండువరహాలు చేతిలో పెట్టటం ఆనవాయితీ , అది అచ్చంగా తనదే అని తనకి నచ్చినట్లు ఖర్చు పెట్టుకో వచ్చుని, నాన్నగారు కూడా యేమీ అనరని . అయితే రాధాకృష్ణ కి యిక్కడ మరో సమస్యొచ్చి పడింది . అంత డబ్బుని యెలా ఖర్చు పట్టుకోడం అని .

అప్పట్లో పది రూపాయలకి చాలా విలువుండేది . సగటు గుమస్తా జీతం మూడువందలకి మించి వుండేదికాదు .

తనకు రాబోయే రెండు వరహాలను యెలా ఖర్చు చెయ్యాలో హరన్నయ్యని అడిగితే నీకెది యిష్టమో ఆలోచించుకోమన్నాడు . గ్లూకోజ్ బిస్కెట్స్ అంటే తనకి చాలా యిష్టం , అదే విషయం అన్నయ్యతో చెప్తే " తిండిపోతు వెంకన్నా , బిసకత్తులూ , తుస్సు పకోడీలూ కాదోయ్ , తిండి వస్తువలు అయితే అందరూ తినెయ్యరూ ? నీకు .......ఒక్క నీకే పనికొచ్చేది కొనుక్కోవాలోయ్ " గిరీశం లెవల్లో అన్నాడు .

తనొక్కడికే పనికొచ్చేది పలక , పెన్సిలు, బాల్ యిలా యెన్ని చెప్పినా అన్నయ్య ఆమోదం పొందలేక పోయేడు . పోనీ అన్నయ్యనే చెప్పమందాం అనే ఆలోచన రాగానే పరుగెత్తుకుంటూ వెళ్లి ' అన్నయ్యా నువ్వు చెప్పు , నాకేంటి కావాలో ' అన్నాడు .

" నన్ను చూడు నీకేమైనా గుర్తొస్తుందేమో " అన్నాడు హరి .

అన్నయ్యను పరీక్షగా కిందనుంచి మీద వరకు చూసేడు యేమీ తట్టలే , మళ్లా పై నుంచి కిందకి చూస్తూ జోళ్ల దగ్గరకు వచ్చేసరికి తట్టింది , ' అన్నయ్యా జోళ్లు ..... జోళ్లు కొనుక్కుంటా ' ఉద్వేగం పట్టలేక గట్టిగా అరచినట్లు అన్నాడు .

" ఇప్పుడు నా తమ్ముడిలా ఆలోచించేవోయ్ " ఓ చిన్న మొట్టికాయ బహుమతిగా యిచ్చేడు .

పెద్దవాళ్లు ముద్దుగా మొట్టికాయలు వెయ్యడం , చిన్నవాళ్లు పెద్ద అవార్డు పుచ్చుకున్నట్లు ఆనందించడం అప్పట్లో జరిగేవి . ఇప్పుడు అలాంటివి యెక్కడా కనబడవు , పొరపాటున పెద్దవాళ్లు అలా చేసినా పిల్లలు దాన్ని అవమానంగా భావిస్తున్నారు .

తన హీరో మెచ్చుకొనే ఆలోచన చేయగలిగినందుకు తనకెంతో సంతోషం కలిగింది . ఇప్పుడైతే జోళ్లషాపుల వివరాలు కొత్తరకాల గురించి తెలుసుకోడం చిటికె లో పని గాని అప్పుడలాకాదు . ఎక్కడో రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పెద్దబజారులో రెండు చవక జోళ్లషాపులు ఒక బాటా షాపు వుండేవి . చవక షాపులో చెప్పులు సగం ధరకే వస్తాయి కాని మన్నిక తక్కువ . పెద్దనాన్నగారు బాటా జోళ్లయితే మన్నిక యెక్కువ , జోళ్లు కరవవు అనేవారు .      ఎన్ని జోళ్లని పరీక్షించినా యెక్కడా పళ్లు కనిపించేవికావు . ఇప్పటి పిల్లలకున్న చొరవ అప్పటి పిల్లలకి వుండేదికాదు , యెన్ని సందేహాలున్నా కడుపులో దాచుకోడం తప్ప బయటకి అనే చొరవ వుండేది కాదు .

పెళ్లికి పదిహేను రోజులుండనగా ఒకరోజు హరన్నయ్య కూరలు తేవడానికి పెద్దబజారు సంతకివెళుతూ వుంటే కాళ్లా వేళ్లా పడి అతని వెనుక వెళ్లి దూరంనుంచి బాటా షాపుని , షాపులో జోళ్లని కళ్లనిండుగా చూసుకొన్నాడు . కాశియాత్ర అవగానే బటాషాపుకి తీసుకు వెళ్లే భాధ్యతని హరన్నయ్యకి అప్పజెప్పేక కాని నిద్దరరాలేదు రాధాకృష్ణ కి .

పెళ్లివారు విడిదింట్లో దిగేంతవరకు పగలూ రాత్రీ రంగురంగుల జోళ్లు , అవి వేసుకొని పాతాళ భైరవి సినిమాలో బాలకృష్ణ లా గాలిలో యెగురుతున్నట్లు కలలు కన్నాడు .

పెళ్లివారు వచ్చేకా కాశియాత్ర యెప్పుడు మొదలవుతుందా అని యెదురు చూస్తూ గడిపేడు . అంత నిరీక్షించిన తరవాత వచ్చిన అవకాశం వదులుకో దలుచుకోలేదు అదీకాక తను చెప్పకపోతే మరెవరైనా పెళ్లికొడుకు కాశియాత్ర ఆపి రెండువరహాలూ కొట్టెస్తారేమో అని అనుమానం వీటితో పంతులు చెప్పమన్న వన్నీ గట్టిగా చెప్పి మావయ్యగారిని ఇంప్రెస్స్ చేసి మరో రెండురూపాయలు బోనస్ కూడా సంపాదించుకున్నాడు . అదనంగా చేతిలో పడ్డ రెండురూపాయలని యేం చెయ్యాలి అని తర్జనభర్జన చేసుకున్నాకా హిందీ సినిమాకి వెళ్లాలని నిశ్చయించుకున్నాడు .

ముందుగా అనుకున్న ప్రకారం హరన్నయ్యతో బాటా షాపులో హరన్నయ్య కాళ్లకున్న పెద్దపెద్ద      పట్టీలున్న హవాయి చెప్పులు లాంటివి యేడురూపాయల తొంభైతొమ్మిది పైసలు యిచ్చి కొనుక్కున్నాడు . షాపువాడు యిచ్చిన రెండు రూపాయి నోట్లను , నలుచదరంగా వున్న నయాపైసాని , జోళ్లడబ్బాని పట్టుకొని మురిసిపోతూ యిల్లు చేరేడు .

పెళ్లిలో అటూయిటూ తిరిగినంతసేపూ జోళ్లుకట్టుకొని , యింట్లోకి వెళ్లేటప్పుడు జోళ్లు చంకలో పెట్టుకొని తిరగసాగేడు . సాయంత్రం అవగానే జోళ్లు గూట్లో ట్రంకు పెట్టె వెనకాల దాచుకొనేవాడు .

చేతిలో మిగిలిన రెండు రూపాయలు యేం చెయ్యాలనే ఆలోచన నిలవనివ్వటం లేదు . హరన్నయ్య పెళ్లికొచ్చిన చుట్టాలు కలిసి

హిందీ సినిమా ప్రోగ్రాం వేసుకోడం చెవినపడింది . నా దగ్గర డబ్బులున్నాయి నన్ను తీసుకెళ్లండని వారి వెనుకబడి వారిని ఒప్పించేడు . అప్పట్లో సినిమా కుర్చీ టికెట్టు రూపాయి , మిగతా రూపాయి యెండాకాలం శలవులలో తాతగారింటికి వెళ్లేటప్పుడు పలాసా లో జీడిపప్పు కొనుక్కోవాలని డిసైడ్ అయ్యేడు .

అప్పట్లో పెళ్లంటే నాలుగు రోజుల వేడుక . మూడోనాటి వేడుకని నాగవల్లి అనేవారు . కాశీయాత్ర తరవాత రాధాకృష్ణ కి పెళ్లిమీద ఇంట్రెస్టు తగ్గి వీధిలో వేసిన పందిట్లో స్థంబాలాట లో పడ్డాడు . పందిరి తీసేస్తే స్థంబాలాట వుండదుగా మరి .

రాత్రి కుర్రజట్టు రెండో ఆట సినిమాకి బయలుదేరేరు . నిద్రపోతే రాధాకృష్ణను వదిలేసి పోదామనేది వారి ప్లాన్లు , కాని రాధాకృష్ణ కన్నుమొయ్యలేదు .

సైకిళ్లమీద డబుల్స్ ట్రిబుల్స్ కూర్చొని సినిమాహాలు చేరేరు . అప్పట్లో మల్టీ ప్లెక్స్ లా యేమన్నానా ? , స్థంబాల హాలు , పాట మొదలయేసరికి వుయ్య్ ..... మని విజిల్స్ , రంగుల బొమ్మలు తెరమీద కదులు తున్నాయి . తనకంటె పెద్దపిల్లలతో సమానంగా హిందీ సినిమా చూస్తున్నాడనే అనుభవం తప్ప సినిమా యెంత అర్ధం అయిందీ అంటే మాత్రం పెద్ద గుండు సున్నాయే . సినిమాహాలులో నిద్ర పోతే సినిమా టికెట్టు డబ్బులు దండగ అవుతాయని బలవంతంగా నిద్ర ఆపుకున్నాడు . ఇంటికి వచ్చేటప్పుడు మాత్రం నిద్ర ఆపుకోలేక పోయేడు . ఇంటికి గుమ్మం దగ్గర సైకిలు దిగి రెండడుగులు వెయ్యగానే తెలిసొచ్చింది ఒక కాలికే జోడున్న సంగతి .

బేర్ మని యేడవాలని అనిపించింది , కాని బయటకి యేడిస్తే వీపువిమానం మోత మోగుతుంది . అందుకే యేడుపు దిగమింగుకొని హరన్నయ్యకి జరిగిన విషయం చెప్పేడు . ఇద్దరూ మళ్లా సైకిల్ మీద సినిమాహాలు వరకు వెళ్లి దారంతా వెతికినా ఫలితం శూన్యం .

ఆ రోజులలో హైస్కూల్లో అడుగుపెడితేనే జోళ్ల వయసు నచ్చినట్లు , పదవతరగతిలోకి వస్తేనే పేంటు వయసువచ్చినట్లు .

ఎవడో తనకొత్తజోళ్లకి దిష్టి పెట్టివుంటాడు , యింకెవడు పక్కింటి " టుల్లు " గాడే , చవకరకం జోళ్లు కట్టుకొని తనయెదురుగా స్టైలు వొలకబోసేవాడు , కొత్తజోళ్లు చూపించగానే " అమ్మో ...... బాటా జోళ్లా " అని ఈర్షగా చూసేడు . వాడి దిష్టే కొట్టింది .

ఈ విషయం యింట్లో తెలిస్తే యింకేమైనా వుందా ? వీపు విమానం మోతతో పాటు పనిష్మెంటుగా తన జోళ్ల వయసు మరో యేడాదికి పొడిగింప బడొచ్చు . వీటిని తప్పించుకోవాలంటే యేం చెయ్యాలి అనే ఆలోచనతో రాత్రంతా నిద్ర పట్టలేదు ,

అయిడియా తట్టడం తోనే హాయిగా ఆదమరచి నిద్రపోయేడు .

మగపెళ్లి వారిని బండెక్కించి వచ్చి నాన్న పెదనాన్నలు కూర్చొని పెళ్లిముచ్చట్లు మాట్లాడుకుంటూ వుంటే తన యీడువాడే కలకత్తా పెదనాన్న కొడుకు సూర్య గాడు బేర్ మని యేడుస్తూ వచ్చి ' నాన్నోయ్ నా జోళ్లు పోయేయి నాన్నా , మధ్యాహ్నం భోజనాలప్పుడు యిక్కడ యిక్కడే విప్పేను " అని వీధి గుమ్మం వైపు చూపించేడు .

రాధాకృష్ణ గుండెల్లో రైళ్లు పరుగెత్తేయి . అంటే తను కొట్టేసి దాచేసిన జోళ్లు సూర్యాగాడివా? యిప్పుడు వాడు పెద్ద ధర్మసంకటంలో పడ్డాడు . నిజం చెప్పి తన్నులు తినటమా ? లేక నిజం దాచి తన బెస్ట్ ఫ్రెండు తన్నులు తినేట్టు చెయ్యడమా ? , సూర్యా గాడు తన్నులు తినడం తనకు యెంత మాత్రం సమ్మతం కాదు . తన అజాగ్రత్త వల్ల తను జోళ్లు పోగొట్టుకున్నాడు కాబట్టి దెబ్బలు తను తినాలి , వాడి జోళ్లు తను కొట్టేసి వాడికి దెబ్బలు తినిపిస్తే దేవుడు పాపంమూట తన నెత్తిన పెడతాడు దాన్ని మొయ్యడం యెవరితరమూకాదని బామ్మ చెప్పిందిగా !

సూర్యా యేడవకురా ? నీ జోళ్లు నేను దాచేనుగా అని ట్రంకు పెట్టె వెనకాల దాచిన జోళ్లు తెచ్చి వాడికి యిచ్చి , తన జోళ్లు పోయిన సంగతి చెప్పి గట్టిగా కళ్లు మూసుకొని వీపు మీద పడే దెబ్బకోసం యెదురు చూడసాగేడు .

దెబ్బ పడలేదు సరికదా నాన్న అలాంటి జోళ్లే కొని నిజం చెప్పినందుకు గిఫ్టుగా యిచ్చేరు .

తరవాత రాధాకృష్ణ జోళ్ల కథని చాలా రోజులవరకు చెప్పుకొని నవ్వుకొనేవారు . రాధాకృష్ణకు కూడా ప్రతీపెళ్లిలోనూ ఆ అనుభవాలు నెమరువేసుకోడం అలవాటుగా మారింది .

" ఒరేయ్ క్రిష్ణా , జ్ఞాపకాల పొరలలో అక్క పెళ్లి దగ్గరే ఆగిపోతే యిక్కడ నీ కొడుకుని ఆశీర్వదించేది యెవరు పద.... పద " అని లేపుతున్న సూర్యాని చూసి " యెంతవరకు వచ్చిందేమిటి పెళ్లి " అన్నాడు .

" మనం అక్షింతలను వెయ్యడమే మిగిలింది , అయినా వొరేయ్ యెన్నాళ్లు జ్ఞాపకాలలో జీవిస్తావురా ? "

" జ్ఞాపకాలలో జీవించడం కాదు సూర్యా , జ్ఞాపకాలు వున్నాయి కాబట్టే జీవించ గలుగుతున్నా , ఈ యాంత్రికమైన జీవితానికి

ఆక్సిజన్ లాంటివి కదూ బాల్య స్మృతులు అంటూ వేదిక వైపు నడిచేడు రాధాకృష్ణ .




సుబ్బూ మళ్లా తప్పినట్లున్నాడు. బామ్మ కాంతమ్మ, వంటింట్లో గిన్నెలు పగిలిపోతాయేమో అన్నట్లు తెగ చప్పుడు చేస్తున్నాది.

కాలుకాలిన పిల్లిలా ఆఫీసు నుండి సుబ్బులు వచ్చేడు.

సంగతి అర్థం కావడానికి ఓ గంట పట్టింది.

నిన్న చూసిన పెళ్లి వారికి సుబ్బులు నచ్చలేదని.

బామ్మ సణుగుడు.

ఏం చేయాలి?

ముసలిదాన్ని చూసి జాలేసింది. ఒక్కర్తీ పని చేసుకోలేకపోతున్నాది.

సుబ్బులు పరిస్తితి మరీ దారుణంగా తయారయింది.

రెండు మెతుకులు కతికి, బామ్మ పడుక్కోగానే బెడ్రూం అంతా జాగింగ్ ట్రాక్ మీద నడకలా నడవటం ప్రారంభిచేడు.

సుబ్బులు రాత్రంతా పడుక్కోలేదు, పెళ్లి చూపులు ఎందుకు ఫెయిలయ్యాయని.

*　　　*　　　*

ఆఫీసు గేటు దగ్గర దర్వాను సెల్యూట్ అందుకోవాలన్న ఇంగితం మర్చిపోయేడు సుబ్బారావ్.

అసలు పేరు సుబ్బారావే. తల్లీ-తండ్రీ కారు ప్రమాదంలో చనిపోతే, నాలుగేళ్లున్న అతన్ని అమ్మమ్మ పెంచి పెద్ద చేసింది. ఆవిడకీ ఎవరూ లేరు.

సుబ్బులు పుట్టక ముందే ఆవిడ భర్త కాలం చేశేడు.

బాధ తెలియకుండా పెంచిందామె.

తల్లీ-తండ్రీ పోయిన సుబ్బులు, రాత్రులు ఎక్కువగా ఏడుస్తుండేవాడు. కొద్ది రోజులయేసరికి కంటి వ్యాధి సోకింది.చిన్న చిన్నగా వున్న చత్వారం, వయసుతో పోటీపడి మరీ పెరిగిపోయింది.

సుబ్బులు ప్రస్తుత స్కోరు మైనస్ ఐదు. అదీ అసలు విషయం, అతని పెళ్లి చూపుల తిరస్కరణకి కారణం.

చదువుకున్న వాడైనందువల్ల, చత్వారం తగ్గించుకునే అన్ని చిట్కాలూ ప్రయోగించుకున్నాడు.

అబ్బే, రావడం దానిష్టం। పోవడం అంత తొందరగా పోతుందా?

సుబ్బులు శారీరకంగా బాగున్నా, కళ్లద్దాలు పెట్టుకోగానే

పొప్పట్ లాల్ - ఉల్టా చష్మా లా వుంటాడు.

దృష్టి లోపాలు, రకాలు, ఎలా వస్తాయి, ఏ ఏ విటమిన్లు తగ్గితే, ఏ రకమైన లోపమొస్తుంది? దానికి ఏంతినాలి? లాంటి విషయ పరిజ్ఞానాన్ని పెంచుకున్నాడు.

అంతే కాదండోయ్, సూర్యరశ్మి వల్ల కూడా తగ్గుతుందంటే సూర్యోదయమప్పుడు అరగంటా, సూర్యాస్తమానంకి అరగంటా కేటాయించి ఎండలో కూర్చుంటాడు.

అయినా దృష్టిలోపం సుబ్బుల్ని క్షమించలేదు. కానీ అదృష్టం స్కోరు పెంచుకోలేదు. గత మూడేళ్లుగా మైనస్ ఐదే.

సుబ్బులు ఏంచేసినా, ఎంత చేసినా దృష్టి లోపం తగ్గలేదు.

*          *          *

"ఏమిటి విశేషాలు సారూ" అటెండరు అప్పలరాజు పిలుపుతో ఈలోకంలోకొచ్చేడు సుబ్బులు.

నిస్సత్తువ, నోరు విప్పి మాట్లాడితే కన్నీళ్లు వరదై పారుతాయన్నట్టుంది సుబ్బులు పరిస్థితి. ఆఫ్టరాల్ ఓ పిల్ల రిజెక్ట్ చేయడమా. చేస్తే చేసింది పో.

తను ఎంతో ప్రేమగా చూసుకునే కళ్లద్దాలని వెటకారం చేస్తుందా.

సుబ్బులు పరిస్తితి మయసభలో భంగపడిన దుర్యోధనుడిలా తయారయ్యింది. వెటకారమాడితే ఆడింది పో. వాళ్ల బాబుకి బుద్ధి వుండక్కర్లే.పిల్లని సరిగా పెంచొద్దూ. బుద్ధి లేకపోతే పో. వార్తాహరుడుకైనా బుద్ధివుండక్కర్లా, మా ముసలమ్మకి చెబుతాడా. చెప్పేడు పో. కోపమోచ్చి ఆవిడ నాలుగు గిన్నెలు లొత్తలు పెడుతుందా? లొత్తలు పెట్టింది పో. నాకెందుకు చెప్పవలె. చెప్పింది పో. నేనెందుకు బాధపడవలె.

అప్పల్రాజు వెలితో సుబ్బులు భుజాన్ని పొడిచేడు.

"సారూ, ఏమైంది? పరాకుగా వున్నారు" నెమ్మదిగా అప్పల్రాజు అడిగేడు. ఆఫీసులో అందరికీ తలలో నాలికలాంటి వాడు

అప్పల్రాజు చాకులాంటి కుర్రాడు. ఏ పనైనా ఇట్టే చక చకా చేస్తాడు. స్వంత పన్లు కూడా పురమాయిస్తారు విధేయుడని. వాడికి అందరి రహస్యాలూ తెలుసు, అయినా సంస్థ రాజకీయాలకి దూరంగా వుంటాడని అందరూ చేరదీస్తారు. ఇరవై ఏళ్ల లోపే వుంటాయి, కుటుంబ బాధ్యతల వల్ల పని మీద శ్రద్ధ పెడతాడు.

సుబ్బులుని గురూగారని పిలుస్తాడు.

సుబ్బులు మెదడు వేడి తగ్గించుకునే ప్రయత్నంలో వున్నాడేమో, అప్పల్రాజుకి విషయం పూసగుచ్చినట్లు చెప్పేడు.

అప్పల్రాజు పగలబడి నవ్వుతూ "ఓస్ ఇంతేనా గురూగారు, ఈమాత్రానికే ఇంతగా బాధపడాలా? "

ఏం చెయ్యమంటావయ్యా? రోజూ మా ముసల్ది ప్రాణాలు తోడేస్తున్నాది.

"సాయంత్రం మాట్లాడుకుందాం సార్, ఎవరో పిలుస్తున్నారు" అంటూ గదిలోంచి అప్పల్రాజు బయటికెళ్లి పోయేడు.

సుబ్బులు గట్టిగా ఊపిరి వదిలి పనిలో నిమగ్నమయ్యేడు.

*       *       *       *

ఇరానీ రెస్టారెంటులో చాయ్ తాగుతూ "సార్ కళ్లద్దాలు లేకుండా వుండలేరా? " అప్పల్రాజు ప్రశ్న.

"అలవాటై పోయింది, ఎప్పుడూ ప్రయత్నించలేదు" సుబ్బులు జవాబు.

"ఓ రెండు మూడు నెలలు ట్రైచేయండి." అప్పల్రాజు బిల్లివ్వడానికి జేబులో చెయ్యి పెడుతుంటే, సుబ్బులు వారించి బిల్లు చెల్లించేడు.

"రేపటి నుండీ సాధన చేయండి సార్." అంటూ అప్పల్రాజు సైకిలెక్కేడు సుబ్బుల్నొదిలి.

ఆఫీసుకి దగ్గర్లో మకాం కాబట్టీ సుబ్బులు రోడ్డు కొలత మొదలు పెట్టేడు ఇంటి వైపు.

అప్పల్రాజు సలహా మీద సుబ్బులు కళ్లద్దాలు లేకుండా వుండటానికి నిశ్చయించు కున్నాడు.

పగటి పూట ఇబ్బంది వుండేది కాదు. చిక్కల్లా చీకట్లోనే.

సాధన బాధాకరంగా వుండేది.చీకట్లో మూడు నాలుగుసార్లు రోడ్డు మీద పడిపోయేడు. మోకాలు చెక్కుకుపోయేయి. పట్టువదలని విక్రమార్కుడిలా నెమ్మదిగా సుబ్బులుకి కళ్లద్దాలు లేకుండా వుండటం అలవాటయింది.

కొన్ని రోజులకి సుబ్బులుకి మరో సంబంధం వచ్చింది. బామ్మ సంబరపడింది. దేవుళ్లకి పూజల లంచం ఆశ పెట్టిందేమో? సుబ్బులు, ముందుగానే చూశేడేమో, నచ్చుకున్నాడు. బెట్టు చేయాల్సిన చోట బెట్టు చేసి పెళ్లి చూపులలోనే ఓకే చేశేశాడు.

అసలు విషయాన్ని దాచిపెట్టటం సుబ్బులికిష్టం లేదు.

అప్పల్రాజు శిష్యుడు మాత్రం గీతోపదేశం చేశేడు.

"నెమ్మదిగా పెళ్లయ్యిం తరవాత చెప్పండి గురూగారూ" అని.

సుబ్బులు ఆత్మసాక్షి ఒప్పుకోవటం లేదు. అదే అన్నాడు కూడా.

"మీరేం తప్పుచేయటం లేదు కదా సార్. పెళ్లయ్యిన మొదటి రాత్రి చెప్పండి. ఇదేం మోసం కాదుగా? "

అప్పల్రాజు అభయ హస్తం.

*　　　*　　　*　　　*

దిగ్విజయంగా సుబ్బులు పెళ్లి జరిగింది.

మనస్సాక్షి గోల ఎక్కువయింది. ఇక లాభం లేదనుకుని ఆ రాత్రే చెప్పడానికి నిశ్చయించుకున్నాడు.

*　　　　　　*　　　　　　*　　　　　*

పట్టు పరుపు. మనసుకి మత్తెక్కించే అత్తరు వాసన. వాసన మాత్రమే వచ్చే అగరుబత్తి ధూపం. మల్లెల ఘుమ ఘుమలు. ఎదో లోకంలో విహరిస్తున్నట్టున్నాది, సుబ్బులుకి. ఒకటికి పది సార్లు జేబులో కళ్ళద్దాల్ని తడుముకున్నాడు.

చిరు కాంతి. జారిపోతున్న గుండె. ఎగేయటం కష్టమవుతున్నాది సుబ్బులుకి.

క్షణమొక యుగంలా గడుస్తున్నాది.

సుబ్బులు నెమ్మదిగా కిటికీ వారగా వెళ్ళి, కళ్ళద్దాలు పెట్టుకున్నాడు.

నెమ్మదిగా అమ్మాయి గదిలోకొచ్చిన మువ్వల చప్పుడు.

తలుపు తెరిచి ఆడంగులు అమ్మాయిని గదిలోకి నెట్టేరు.

పక పకలు, వ్యంగ్యాలూ, తలుపుమూసి గడియ పెట్టిన చప్పుడు.

సుబ్బులు హృదయ స్పందన మారుతున్నాది. సెన్సోఫోనిక్, స్టీరియో సౌండ్ తో గుండె చప్పుడు వినిపిస్తున్నాది. భయంకరాతి భయంకరంగా.

తలతిప్పి చూడ్డానికి భయపడ్డాడు.

మువ్వల చప్పుడు శ్రావ్యంగా వినిపిస్తున్నాది.

నెమ్మదిగా వీణ తంత్రులు మీటినట్టు "నేనొచ్చేను" అందా అమ్మాయి.

ఎక్కువ బెట్టు చేస్తే బాగుండదనుకున్న సుబ్బులు, నెమ్మదిగా కళ్లద్దాలు ముక్కు చివరకి సున్నితంగా వేళ్లతో నడుతూ చూసేడు.

ఎవరీ అమ్మాయి? ప్రశ్నార్ధకం మొహం పెట్టి, ఆలోచనగా అనుమానంగా .

గుండ్రటి ముఖం.కోల కళ్లద్దాలూ.

"నేనేనండీ, పెళ్లికి ముందే చెబుదామనుకున్నా. కానీ కళ్లద్దాలున్నాయని చాలా సంబంధాలు తప్పిపోయేయి. మా అమ్మ చెప్పొద్దని, కట్టడి చేసింది......"

ఇంకా ఎం చెప్పిందో వినపడలేదు సుబ్బులుకి ఉరఫ్ సుబ్బారావుకి.

ఎవరో నెత్తిన కొట్టి, "తాడిని తన్నేవాడుంటే, తలదన్నే వాడుండడా సుబ్బూ" అన్నట్టు వినిపించింది స్పృహ కోల్పోయేడు పాపం సుబ్బారావు.

కింద పడిపోకుండా పట్టుకుందా కళ్లద్దాల పెళ్లికూతురు.




హాపీ బర్తడే మధూ చెప్పింది అతని స్నేహితురాలు మౌనిక .పుట్టినరోజు శుభాకాంక్షలు మదూ .చెప్పాడు మరో స్నేహితుడు శేఖర్ ,మధుకి రంగు,రంగుల పూల బొకే ఒకటి చేతికందిస్తూ .

మధు ఒక పెద్ద ఫ్యాషన్ డిజైనర్ .ఈరోజు అతని పుట్టినరోజు కావడంతో, స్నేహితులంతా కలిసి అతని ఇంటికి వచ్చి,ఇలా ఒకరి తర్వాత ఒకరు పోటీ పడి మరీ శుభాకాంక్షలు చెప్తున్నారు.వారి విషెస్,ఆ హడావుడి తగ్గాక, మధు ఇచ్చిన అల్పాహార విందు కానిచ్చారు. ఆ తర్వాత మధు,తను లేటెస్టుగా డిజైన్ చేసిన ఓ మాడ్రన్ షర్టుని వారికి చూపించి ,ఎలా ఉంది ?అడిగాడు ఉత్సాహంగా.అందరూ దాని వంక ఓ క్షణం పాటు చూసి ,వావ్ ,చాలా బావుంది .ముఖ్యంగా ఆ షర్టు కాలర్ నల్లరంగులోనూ,చొక్కా నీలం రంగులోనూ, ఫుల్ హాండ్ చివర మళ్ళీ నల్ల రంగులోనూ ఉండటం వలన షర్టు అందం మరింత పెరిగింది.చెప్పాడు స్నేహితుడు హరి,కళ్ళప్పగించి మరీ ఆ చొక్కా వంక చెక్క బొమ్మలా చూస్తూ.

మరే, అయినా మన మధు ఫ్యాషన్ డిజైనింగులో రాకెట్టులా దూసుకుపోతున్నాడంటే ,అతని కత్తి లాంటి కొత్త ఐడియాలే కారణం.మధుది బుర్ర కాదు పాదరసం నిండిన తొర్ర. వీడు తలుచుకుంటే, సుబ్బయ్యని కూడా సూపర్బుగా తయారుచేయగలడు .కనుక ఈ సారి కూడా ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డిజైనింగ్ కాంటెస్టులో వీడె ఫైనల్ విన్నర్ ,చెప్పాడు మరో స్నేహితుడు గిరి, చాలా నమ్మకంగా.

అతని మాటలు విన్న మధు స్నేహితురాలు మౌనిక ,అతనికి కాస్తంత దగ్గరగా వచ్చి ,చెవిలో, ఎంత పెద్ద ఫ్యాషన్ డిసైనర్

అయితే మాత్రం ఏం లాభం గిరీ ?భార్యగా ఓ పల్లెటూరి అమ్మాయిని కట్టుకున్నాడు.పైగా ఆమెకి ఈ పాశ్చాత్య దుస్తులంటే పడదు.అంచేత ఆమె మధుతో ఎక్కడికి వెళ్ళినా ,నేత చీరలూ ,రోత, పాత మాడెల్ డ్రెస్సులే వేస్తుందాయే. అందుకేనేమో ,ఆమెని మన మధుతో పాటు చూస్తే ,లాప్ టాప్ పక్కన పలకా, బలపాన్ని పెట్టినట్టూ, ఫ్రిజ్జి పక్కన మట్టి కుండని ఉంచినట్టూ ,ఏ.సి పక్కన విసన కర్రని తగిలించినట్టు అనిపిస్తుందంటే నమ్మండి నాకు .చెప్పిందామే పక .పకా నవ్వేస్తూ.

అయినా మౌనికా,మధు తలుచుకుంటే ఆమెకి కూడా మంచి మాడ్రన్ డ్రెస్సెస్ డిజైన్ చేయగలడు .కాకపోతే బలవంతంగా ఎందుకు ఆమెపై తన ఇష్టం రుద్దడం అనీ ,అలా ఆమెకి నచ్చిన సంప్రదాయమైన డ్రెస్సులు వేసుకునే అవకాశం ఇచ్చాడేమో .చెప్పాడు గిరి.

అది నిజమే కానీ చూసేవారికి అలా అనిపించక పోవచ్చు.మధు డిజైన్ చేసిన డ్రెస్సెస్ నచ్చకో ,లేక ఎబ్బెట్టుగా ఉంటాయనో ,మరేదైనా కారణం అయుండొచ్చని అనుకుంటారు.కానీ ,ఇలా ఇంత పాజిటివ్ గా ఎవరు ఆలోచిస్తారు ?మూతి విరిచిందామే.

వాళ్ళిద్దరి మాటలూ మధు చెవిన పడనే పడ్డాయి .చాటుగా ,మౌనంగా, క్రికెట్ ఎంపైర్లా చూస్తుండిపోయాడే తప్ప ఏం మాట్లాడలేదు .కారణం,మధు మనసులోని కోరిక కూడా అదే.మౌనిక మాటలు ఆ కోరికకి మరింత ఊతం ఇచ్చాయి. కొద్దిసేపటికి వాళ్ళంతా వెళ్ళిపోయారు.

తర్వాతి రోజు పొద్దునే లేచిన మధు ,కొన్ని వెస్ట్రన్ డ్రెస్సులని పైకి తీసి పెట్టి ఉంచాడు.తర్వాత కొద్ది సేపటికి ,గుడి నుండి వచ్చిన తన భార్య లలితకి వాటిని చూపిస్తూ ,ఇవి ఎలా ఉన్నాయి లలితా. అడిగాడు చిన్న నవ్వుతో.

బానే ఉన్నాయండి.కానీ మరీ ఇలా ఇంత బిగువుగా ,కురచగా ఉంటే,అమ్మాయిలు వీదుల్లోకి ఎలా వేసుకువెళ్తారండి పాపం.

అడిగిందామె ఆ బట్టలవంక అమాయకంగా చూస్తూ.

ఆమె మాటలకి మధు,పళ్ళు పట ,పటా కొరుకుతూ,నీకిదే తెల్సు పల్లెటూరి గబ్బిలాయి .నిన్ను నాతో పాటు ఎక్కడికన్నా తీసుకెళ్లాలంటే ,నాకు చాలా సిగ్గేస్తోందంటే నమ్ము.ఎప్పటినుండో పోరుతున్నా నీ శైలి మారలేదు .చెప్పాడు అసహనంగా.

భలే వారేనండీ!మీకేందుకండీ అంత సిగ్గు.నేను ఒళ్ళు కనబడకుండా సంప్రదాయమైన చక్కని బట్టలే వేసుకుంటున్నానుగా.అయినా నాకు నచ్చిన బట్టలు నేను వేసుకునే స్వేచ్చ కూడా నాకు లేదాండీ అడిగిందామె అమాయకంగా .

గాడిద అండం. నేను పెద్ద ఫ్యాషన్ డిసైనర్ .అయినా మా అమ్మ మాట కాదనలేక ,నీకు బావనైన పాపానికి, నీలాంటి పాత కాలం మనిషి మెడలో తాళి కట్టాను.ఇదిగో ఇలా అనుభవిస్తున్నాను.అసలు నేను ఎలాంటి మోడ్రన్ డ్రెస్సెస్ డిజైన్ చేస్తానో తెల్సా .అలాంటిది ,నువ్వు నాతో బయటికి వచ్చేపుడు ఇలాంటి ముతక బట్టలు వేసుకుంటే నా తల కొట్టేసినట్టయిపోతోంది .అందుకే నువ్వు అరిచి గీ పెట్టినా ,ఈ సాయంత్రం మనం వెళ్లబోయే పెళ్లి రిసెప్షన్ కి నేను డిజైన్ చేసిన మాడ్రన్ డ్రెస్ వేసుకు తీరాలి.అంతే .లేదంటే నీ అంతే అని ఆమెతో నిర్లక్ష్యంగా అనేసి,కుర్చీలోంచి లేచాడు. ఎదురుగా బుక్ షెల్ఫులో చలం గారి “స్త్రీ” పుస్తకం కనబడింది. స్త్రీకి కూడా శరీరం ఉంది,దానికి వ్యాయామం ఇవ్వాలి.ఆమెకి మెదడు ఉంది,దానికి జ్ఞానం ఇవ్వాలి.ఆమెకి హృదయం ఉంది,దానికి అనుభవం ఇవ్వాలి.స్త్రీ పురుషులు నిజమైన స్నేహితులూ,దంపతులూ కావాలంటే ,ఇద్దరికీ సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలి అనే చలం గారి పుస్తకంలోని మాటలు అతని చెవుల్లో వినిపించినట్టనిపించినా పెద్దగా పట్టించుకోలేదు మధు.

ఆ మాటలకామె ,మౌనంగా చూస్తూ,సరే మీ ఇష్టం.అంటూ అయిష్టంగానే బ్లాక్ టాప్ పై కురచ నీలం రంగు స్కర్టు వేసుకుని, హెయిర్ స్టయిల్, వగైరా కూడా మధు చెప్పినట్టే ఫాలో అయింది.కళ్ళకద్దుకుని తాళి,మెట్టెలు,తీసేసి, మధు చెప్పినవి వేసుకుంది.తర్వాత ఇద్దరూ రిసెప్షన్కి వెళ్లారు.అక్కడ మధుని పలకరించినవారు ,ముఖ్యంగా మగాళ్లు ,ఇంచుమించు అంతా,ఎవరీ అమ్మాయి.మీ డ్రస్ డిజైన్స్ ప్రెసెంట్ చేసే కొత్త మోడలా అని అడిగారు,ఆమెని ఎగా ,దిగా,కాకెంగిలి చూపులు చూస్తూ.

ఆ మాటలకి మధు ,కాస్త అసహనంగా,కాదు .ఈమె నా వైఫ్ .చెప్పాడు మూతి బిగించి.

అలాగా?సో బ్యూటిఫుల్ .అవును మరి,మీరు డిజైన్ చేసిన బట్టలు వేసుకుంది కనుకే ఆమెకి అంత అందం,బింకం,పొంకం వచ్చాయి. చెప్పాడు అక్కడ ఓ గుంపులో ఓ గోవిందు.ఆ వెంటనే ఇంకోడు వచ్చి ,ఛ ,ఛ, అదేం కాదు.ఆమె వేసుకుంది కనుకే ఆ డ్రెస్సుకి అంత అందం వచ్చింది.అంటూ తన జేబులోంచి మొబైల్ ఫోన్ తీసుకుని ,చక,చకా ఆమెని నాలుగు ఫోటోలు తీసేసి, నేనూ డిసైనర్నే.డ్రెస్సు నచ్చితే ఆగలేను ఇలా ఫోటో తీస్తాను.బైదవే ఈమెని మాడెల్గా ఎందుకు వాడకూడదు?మీ వైఫ్ చూడ్డానికి మోడల్ లానే ఉన్నారు .అలాగే ఈ ఫోటోల్ని నేను ఏదైనా యాడ్ పబ్లిసిటీకి వాడవచ్చా మధుగారు అడిగాడతను.

నో ........అని తన చేతులు కొంచెం ఇబ్బందిగా నలుపుకుని,ముఖాన్ని చిట్లించి ,చూడు మిష్టర్ ,కావాలంటే అలాంటి డ్రెస్సే మరోటి ఇస్తాను.మీ ఆవిడకి వేసి,ఫోటోస్ తీసి ,నీ ఇష్టం వచ్చినట్టు ఎక్కడ పడితే అక్కడ వాడుకో.పో .కసిరేశాడతన్ని. ఇట్ ఈజ్ ఓకే .ప్లీజ్ డోంట్ మైండ్ అని చెప్పి ఆ ఫోటోస్ ని డిలీట్ చేసి.అక్కడ్నుండి మాయమైపోయాడతను.తర్వాత మధు లలితలిద్దరూ డిన్నర్ చేసి ఇల్లు చేరారు.

మరుసటి రోజు లలిత , అరె ఇక్కడే పెట్టానే .అంటూ ,సొరుగు,అరుగూ,బీరువా అని తేడా లేకుండా అన్నీ తెగ గాలించేస్తూ ,చాలా విచిత్రంగా ఉందే !ఇక్కడే జాగ్రత్తగా మడతేసి మరీ పెట్టానే .ఏమైపోయిందండీ ఆ మాడ్రన్ డ్రెస్సు .అంటూ ఆశ్చర్యంతో కొయ్యబారి ఆలోచిస్తోందామె.


అప్పటివరకూ ఆమె మాటలు వింటున్నా ,విననట్టుగా ఉన్న మధు,కొంచెం గొంతు సవరించుకుని,ఓహ్ ఆదా? నేనే వేరే మాడెల్కి ఇస్తానని చెప్పాను.అందుకే దానిని ఇందాకే తీసి ,నా రూములోని బీరువాలో పెట్టాను.చెప్పాడు, పేపర్ లోంచి తల బయట పెట్టి .

అవునా ? మరీ నాకో .అసలే ఆ డ్రెస్సుని సాయంత్రం ,మనం వెళ్ళే పెళ్ళికి వేసుకుందామనుకున్నానుగా మరి.ఇప్పుడెలా.అడిగిందామె, చిరు నిరుత్సాహంగా.

ఆ డ్రెస్సే వేసుకు రావాలా ఏంటి.మరో డ్రెస్సు వేసుకు వద్దువుగానిలే .చెప్పాడు నింపాదిగా. అంటే !అంత కంటే మాడ్రన్ గా ఉండే మరో డ్రెస్సుని నా కోసం డిజైన్ చేసి ఉంచారన్న మాట.అడిగిందామే ,తెగ గారం పోతూ ,బుంగమూతిలో. ఏడిసినట్టుంది .నా మాటలకి అర్ధం అది కాదు .నీకున్న డ్రెస్సులలోనుండి ఓ మంచి డ్రెస్సు తీసుకు వేసుకోమని .చెప్పాడు ముఖం చిట్లించి. నా డ్రెస్సులలోనుండా?వాటిని మీరెప్పుడూ ముతక బట్టలంటారుగా .పైగా వాటిని వేసుకుంటే మీ పరువు ,గట్రా...నసిగిందామె . పోనీ,పోతేపోనీ ,మంటగలిసిపోనీ ,ఏం పర్లేదు.కొంపకొల్లేరు కాదు .నువ్వు నీ ఇష్టం మార్చుకోవడం నాకిష్టం లేదు. కనుక ఇక నుండి నువ్వు ,నీకు నచ్చిన ఆ సంప్రదాయ బట్టలే వేసుకో.చెప్పాడు నేల చూపులు చూస్తూ.

మధు మాటల అంతరార్ధం అర్ధం చేసుకున్న లలితకి చాలా సంతోషం అనిపించింది.ఇష్టం లేకున్నా,మధు పోరుపడలేక , మోడ్రన్ బట్టలు వేసుకుని నచ్చినట్టు నటించినందుకు ప్రతిఫలం దక్కిందని సంతోషించింది. నాగరిక దుస్తులని గోల పెట్టిన పతిగారు,ఆ నాగరిక దుస్తుల్లో తన భార్యని పరాయి మగాళ్లు చూడటం మాత్రం తట్టుకోలేకపోయాడు .ఇక ఆ నారికత బట్టల నుండి ప్రవర్తనకి మారితే ఏమైపోతాడో! అనుకుందామె.పైగా,ఇంతకాలం నాగరికత తెల్సిన కొత్త మనిషి గా చలామణి అవుతున్న తన బర్త ఆలోచనలు ఇంత పాతగా ఉంటాయని తనెప్పుడు అనుకోలేదు.అలాగే ఇక నుండి తన వేషదారణని పల్లెటూరి గబ్బిలాయ్ ,పాత కాలం మనిషి ,ముతక బట్టలు వేసుకుంటావ్ లాంటి మాటలు అని దెప్పిపొడిచే అవకాశం మధుకి లేదు. అతని తిక్క కుదిరింది.అనుకోకుండానే ,ఆమె పెదాలపై ఓ చిరునవ్వు మెరిసింది.ఆ నవ్వులోనే అనుకోకుండా మధు వైపు చూసిందామే.

మధు కూడా ఓ నవ్వు నవ్వి ,చలం గారి స్త్రీ పుస్తకం ఉన్న షెల్ఫు వైపు అడుగులు వేశాడు.




డిటెక్టివ్ అసిస్టెంట్ అవినాష్ వెర్నా కారును ఆపుతుండగానే హడావిడిగా డోర్ తెరుకొని దిగి పోయాడు డిటెక్టివ్ బాలి.

కారులోంచి దిగిన ఆరడుగుల అందమైన ఆ పర్సనాలిటీని "వెర్నా విండ్ షీల్డు" మీదున్న" తర్డ్ ఐ డిటెక్టివ్ ఏజన్సీ " అక్షరాలను చూస్తూనే అలర్టయి పోయారు పోలీస్ స్టేషన్ ముందు డ్యూటీలో వున్న సెక్యూరిటీ గార్డ్స్.

కడక్ సెల్యూట్ చేసి..

"మీ కోసం ఏసిపీ సార్ వెయిటింగ్ సర్." ఉత్సాహంగా చెప్పాడొక గార్డ్. వెర్నా దిగుతూనే ..చుట్టూ పరిశీలించి చూశాడు..డిటెక్టివ్ బాలి.

అప్పటికే ప్రెస్..మీడియా జనాలతో స్టేషన్ కిటకిటలాడి పోతోంది.

కార్ పార్క్ చేసి వచ్చిన అవినాష్ దారి తీస్తుంటే..

"అవినాష్ బీ అలర్ట్! మనం పోలీస్ రిపోర్టు మీద డిపెండైతే కేసు క్రాషై పోతుంది. మైన్యూట్ ఎవిడెన్స్ కూడా మిస్సవ కూడదు.. ఎవ్విరి కాయిన్..హేజ్ టూ సైడ్స్ ..మనకు ఎవిడెన్స్ దొరికేది కానిస్టేబుల్ అండ్ రైటర్ ల వంటి లో కేడర్ దగ్గరే. ఇది డిపార్ట్ మెంట్ కేసు. ఎవిడెన్స్.. దొరకదు.దొరకనివ్వరు. బీ కూల్ అండ్ కాషియస్. స్టెల్లాను కాంటాక్ట్ చేసి టీవీ లో ఈ కేస్ టెలికాస్ట్ అయితే క్లిప్పింగ్స్ రికార్డ్ చేయమని చెప్పు."

" ఐయాం రెడీ విత్ ఎవ్విరి తింగ్ బాస్! ఆల్రెడీ స్టెల్లా ఆ ప్రయత్నాల్లోనే వుంది."

సమాధానం చెపుతూనే తన స్పై కెమారా యాక్టవేట్ చేసి ఎదురుగా వస్తున్న ఏసీపి శాండిల్యను చూస్తూనే..నవ్వుతూ విష్ చేస్తూ సైడై పోయాడు అవినాష్ .

ఎన్నో కేసుల్లో కలిసి పని చేశాడు బాలి శాండిల్యతో.

"మిస్టర్ బాలి!ఇన్సిడెంట్ జరిగిన ప్లేసు ను క్లోజ్ చేసి పెట్టాం.పోలీస్ స్టేషన్ లో జరిగిన ఇన్సిడెంటిది. మేం ఏంచెప్పినా ప్రెస్ గాని మీడియా కాని నమ్మదు. అందుకే కేసు నీకు హేండోవర్ చేయాలని నేనే స్వయంగా డీల్ చేస్తున్నాను."

ఇన్సిడెంట్ జరిగిన ఇంటరాగేషన్ రూం కు దారి తీస్తూ బ్రీఫ్ చేశాడు..ఏసీపి శాండిల్య.

ఏసీపి ఆర్డరు తీసుకొని రూం ఓపెన్ చేశాడు ఓ కానిస్టేబుల్. తోసుకొస్తున్న ప్రెస్ మీడియా జనాల్ని ఎస్సై అదుపు చేస్తుంటే మౌనంగా లోపలికి ఎంటరయ్యాడు బాలి. రూం మధ్యలో పడి వుందో యువకుడి బాడీ. ఎడమ చేతి మీద కోసుకున్న గుర్తు..కారిన రక్తంతో తడిసిన షర్ట్..తప్ప గమనించే క్లూస్ ఏమీ కనిపించలేదు బాలి కళ్లకి. యువకుడి వయసు దాదాపు ఇరవై ఐదు సంవత్సరాల వరకు వుండొచ్చనే నిర్ణయాని కొచ్చాడు బాలి. మౌనంగా బయటికొచ్చి ఏసీపి ఎదురుగా సెటిలై పోయాడు.

"మిష్టర్ బాలి! ఆ యువకుడి పేరు..కిషన్ మల్హోత్రా..బీటెక్ ఫైనలియర్ స్టూడెంట్. ర్యాగింగ్ కేసుక్రింద బుక్ చేసి నిన్న సాయంత్రం స్టేషన్ కు తీసుకొచ్చారు. రాత్రి ట్వెల్వో క్లాక్ వరకు ఎస్సై..ఇంటరాగేట్ చేశాడట. తను ర్యాగింగ్ చేయలేదని..తన ఫ్రండ్స్ చేశారని..రేపు కాలేజి కొచ్చి ఎంక్వైరీ చేస్తే నిజం తెలుస్తుందని ఇంటరాగేషన్ లో చెప్పాడని..రేపు కిషన్ తో కాలేజికెళ్లి మరో సారి ఎంక్వైరీ చేస్తానని రాత్రి రిపోర్టుచేశాడు ఎస్సై.కానీ మార్నింగే ఈ షాక్. ఈ సంగతి తెలిస్తే స్టూడెంట్స్ స్ట్రైకులు చేసి స్టేషన్ కొచ్చి ధర్నాలు చేస్తే నానా రచ్చరై పోతుంది.అందుకే నీకు ఫోన్ చేసి..కేసు నేను టేకప్ చేశాను.ట్రైటు సాల్విట్ యాజెర్లీ యాజ్

పాజిబుల్".

ఏసీపీ శాండిల్య రిక్వెస్ట్ వింటూనే చిన్నగా నవ్వి

"మా రిపోర్టెందుకు.? ఆత్మహత్యనే కలరింగిచ్చి కేసు క్లోజ్ చేయొచ్చుగా?ఇది మీరు ఆనవాయితీగా అవలంబిస్తున్న ఈజీ మెథడేగా?"

బాలి సెటైర్ అర్ధమైనా బ్లాంక్ పేసులో చూశాడు శాండిల్య.

సిఐ వచ్చి కాన్ ఫరెన్స్ హాల్లో ప్రెస్ మీడియా సమావేశముందని చెప్పడంతో..

"కమ్ బాలీ ..డిపార్ట్ మెంటులో వున్నందుకు మాకు ఈ యుద్ధాలు తప్పవు." హడావిడి నటించి..బయలుదేరి పోయాడు.

*****

కాన్ఫరెన్స్ హాల్ .. ప్రెస్ మీడియా జనాలతో నిండి పోయింది. ఛానెళ్ల కెమారాలన్నీ డయాస్ మీదున్న ఏసీపీ..సిఐ..ఎస్సై..బాలిల ముఖాలమీద జూమై పోయాయి.

సోది ఛానెల్ న్యూస్ రిపోర్టర్ యాదక్క లేచింది.

"ఏసీపీ సర్ !నిన్న రాత్రి జరిగిన ఈ సంఘటన గురించి మీ అభిప్రాయం ఏమిటి ? ఇంతకు ముందు జరిగిన సంఘటనలకు లాకప్ డెత్ లని పేరు పెట్టి చేతులు దులిపేసు కున్నారు.ఆ రేండు కేసుల్లో వున్న ముద్దాయిలు రౌడీ షీటర్సు రేపిస్టులు కాబట్టి మీడియా కూడా పట్టించుకో లేదు. కిషన్ ఒక రెప్యూటెడ్ ఇంజినీరింగ్ కాలేజి స్టూడెంటు పైగా మన కాలేజీలను నమ్మి నార్తిండియా నుంచి వచ్చాడు. మేం ఈ సారి చాలా సీరియస్ గా తీసుకుంటాం.మీరేమంటారు.?

నస చానెల్ నారాయణమ్మ గొంతెత్తింది.

“చట్టం

తన పని తాను చేసుకు పోతుంది..చట్టం ఎవరికీ చుట్టం కాదు.. నేరస్తులు దొరికితే వారెంతటి వారైన శిక్షిస్తాం..లాంటి స్టాకు డైలాగులు అప్ప చెపుతారా.?

స్కాముల ఛానెల్ స్వామి తనమాటలు గన్ లోంచి రాలే బుల్లెట్లని మురిసి పోతూ..నోరిప్పాడు.

“సర్! ఆ ఇంజినీరింగ్ కాలేజి ర్యాగింగ్ ఫ్రీ కాలేజని మొన్నీ మధ్యే ఆ కాలేజి డే లో తమరే..దండలేయించుకుని మరీ కెమారాలకి ఫోజిస్తూ హీరో లెవెల్లో..చె ప్పారు..యిప్పుడు ప్లేటు మారుస్తున్నారు..ఎవరిని రక్షించాలని..?

అయోమయంగా చూస్తున్నట్లు కెమారాలకు పోజిస్తూ..లేచి నిల బడ్డాడు ఏసీపీ.

“జరిగిన సంఘటనకు మేం చాలా చింతిస్తున్నాం.మీరు డిపార్టుమెంటును నమ్మరనే ఈ కేసు “తర్డ్ ఐ డిటెక్టివ్ ఏజన్సీకి” అప్పగిస్తున్నాం. మిస్టర్ బాలి గురించి మీ మీడియాకు బాగా తెలుసు.రిపోర్టు రాగానే యాక్షన్ తీసుకుంటాం.”

అకస్మాత్తుగా న్యూస్ తప్పించి సినిమా చెత్త, బూతుల కామెడీ ప్రసారం చేసే ..ఛీ ఛానెల్ రిపోర్టర్ పూతరేకుల పుణ్యవతి అడిగింది.

“సర్ ! మాకు” తర్డ్ ఐ ఏజన్సీ” మీద పూర్తి నమ్మకముంది. అప్పుడు స్టేట్ విభజన టైంలో శ్రీకృష్ణ కమిటీ వేసి వన్నియర్ లాగించి..చెత్త బుట్టలో పారేశారు..తర్డ్ ఐ రిపోర్టుకు కూడా అదే గతి పట్టదని నమ్మమంటారు. మా చెవుల్లో మీకేమైనా కాలి ఫ్లవర్స్ కనిపిస్తున్నాయా?.

ఏసీపీ కి దిగి రాక తప్పలేదు.

“బాలి గారి అనుమతి తో టైం సెట్ చేసుకుందాం.వారిచ్చే రిపోర్టు మీ అందరి ముందే రివిల్ చేస్తాం.”

పాత్రికేయులంతా "నో "అంటూ తమ అసమ్మతి తెలిపారు.

"మీ డిపార్ట్ మెంటు జిమ్మిక్స్ మాకు తెలుసు. థర్డ్ ఐ రిపోర్టు కాదు రివీల్ చేసేది. మీ డిపార్ట్ మెంటు దొంగ రిపోర్టుల సంగతి దునియ మొత్తం ఎరికే.

శాండిల్య రిక్వెస్ట్ మీద బాలి నోరిప్పాడు.

"డియర్ ఫ్రెండ్స్ ! మా డిటెక్టివ్ ఏజన్సీ రెప్యుటేషన్ మీకు తెలుసు. మల్లి ఇదే ప్లేసులో విథన్ ఏ వీక్ డేస్ లో మా రిపోర్ట్ మీ ముందే నేనే రివీల్ చేస్తాను. "

*****

"థర్డ్ ఐ ఆఫీస్ " బాలి తన ఎగ్జిక్యూటివ్ టేబుల్ ముందు రిలాక్స్ డ్ గా కూర్చొని "మైకేల్ క్రిస్టన్ డిస్ క్లోజర్ " చదువుతున్నాడు.గుడ్ మార్నింగ్ చెపుతూ వచ్చిన అవినాష్..ఔట్ సోర్సింగ్ డిటెక్టివ్ అసిస్టెంట్..జాకీ..సెక్రెటరీ స్టెల్లాతో బాటు రిసెప్షనిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ శిరీష కూడా వచ్చి బాలి ఎదురుగా కూర్చుండి పోయారు.

బాలి కనుసైగతో అవినాష్ తన ఇన్వెస్టిగేషన్ రిపోర్టు వివరణ యిస్తుంటే శిరీష తన నోట్ బుక్ లో నోట్ చేయడం మొదలు పెట్టింది.

"బాస్ ! మొన్నటి మీటింగ్ విడియోని "మన ఫేస్ స్కానింగ్ అండ్ బాడీ లేంగ్వేజ్ ఎక్స్ పర్ట్" డేనియల్ తో టెస్ట్ చేయించాను. యువర్ గెస్ ఈజ్ సెంట్ పర్సెంట్ కరెక్ట్. పోస్ట్ మార్టమ్ రిపోర్టు ప్రకారం ఆరాత్రి "ట్వల్వ్ టూ టూ మధ్య మర్డర్ జరిగింది. కిషన్ మరణానికి కారణం చేతి మీదున్న కత్తి గాటు కాదు.ఊపిరాడకుండా చేసి చంపేసి ఆత్మహత్యగా చిత్రించడం కోసం కత్తితో గాటు క్రియేట్ చేశారు.అతని చేతినుండి కారిన బ్లడ్ వెరీ లిటిల్.దాని మూలంగా వయసులో వున్న వ్యక్తి చనిపోయే అవకాశం లేదని రిపోర్ట్ నివేదిక. మన జాకీ రిపోర్టు ప్రకారం ఆల్రెడీ ఆ స్టేషన్ పోలీసులు కిషన్ తో బాటు కాలేజి ప్రిన్సిపల్ క్కూడా మూడు సార్లు వార్నింగ్స్ యిచ్చారని స్టూడెంట్స్ చెప్పారట.అమ్మాయిని ట్రేసవుట్ చేస్తే కిషన్ తో లవ్ లో వున్న ద్దరమ్మాయిల పేర్లు తెలిశాయి. యిద్దరి పేర్లూ లాలసే. ఫ్యాషన్ టెక్నాలజి ఫైనలియర్ స్టూడెంట్స్ .కిషన్ కాలేజిలో

లాలసలు ఫ్యాషన్ వీక్ కండక్ట్ చేసినప్పటి పరిచయం ప్రేమగా మారిందట. తన కూతురు ఓ అనామకుడిని ప్రేమించిందన్న కోపం ..హత్యకు కారణమని భావించొచ్చు. ఆ రోజు సీఐ హెడ్ కానిస్టేబుల్ తో ఔటాఫ్ స్టేషన్.ఆ రాత్రి స్టేషన్ లో వున్నది ఒక స్టేషన్ ఆఫీసర్ ఇద్దరు సెక్యూరిటీ గార్డ్స్. ఏసీపీ కి రిపోర్టు చేసి ఎస్సై ట్వెల్లో క్లాక్కే..వెళ్లి పోయాడనేది నిజమని తేలింది. ఎంత ట్రై చేసినా ఎవరూ నోరిప్పడం లేదు."

అవినాష్ ! గుడ్ అండ్ యూజుఫుల్ రిపోర్ట్. ఇది పోలీస్ కేసు. సాక్ష్యాలు ఇంపాజిబుల్ . నీ రిపోర్టు మూలంగా నేనో అండర్ స్టాండింగ్ కొచ్చాను. గిల్టీ ఆర్ ఎఫ్రైడ్ అనే సైకలాజికల్..బలహీనత ఇన్వెస్టిగేషన్ కు చాలా హెల్పవుతుందనేది నాకు అనుభవంనేర్పిన పాఠం. నౌ టార్గెట్ ఈజ్ క్లియర్. బట్ టార్గెట్ ఈజ్ ఇన్ ద డార్క్..బాణం వేద్దాం..హిట్టవుతుంది..అదర్ వైజాల్సో ఐ హేవ్ అనదర్ ప్లాన్ .

"శిరీషా ! నీ నోట్ ప్యాడ్ నా టేబుల్ మీదుంచి స్టెల్లాతో..ఓసారి నిఫ్ట్ కెళ్లి లాలసలను టేకిల్ చేసి రండి.

*******

క్రైం బ్రాంచ్ ఆఫీస్. సౌండ్ ప్రూఫ్ రూం.ఏసీపీ శాండిల్యతో

బాలి అవినాష్ జాకీలతో బాటు స్టెల్లా శిరీషలు సమావేశ మయ్యారు. డిటెక్టివ్ బాలి మాటలు విన్న ఏసీపీ బ్లాంక్ ఫేసు పెట్టేశాడు.

మిస్టర్ బాలి !ఆర్ యూ ష్యూర్ ? ఐ కాంట్ బిలీవిట్.

చిరునవ్వుతో చెప్పాడు బాలి

" డియర్ సర్ ! అవర్సీజే రెప్యూటెడ్ డిటెక్టివ్ ఏజన్సీ. వితౌట్ ప్రోపర్ ఎవిడెన్స్..వియ్ విల్ నాట్ ప్రెజెంట్ ద కేస్. దట్స్ వై వియార్ ఇన్స్యూవర్ ప్రజెన్స్. దిసీజె సైకలాజికల్ ట్రీట్మెంటు. వియ్ హేవ్ టూ టార్గెట్స్..వి విల్ స్టార్ట్ విత్ సీఐ . మీరే హ్యాండిల్ చేయండి.ఇటీజ్ ట్రూ అని కన్ఫం చేసుకున్నాకే యాక్షన్ తీసుకోండి. "

కాన్ఫిడెంటుగా బాలి చెప్పిన మాటలు వింటూనే కన్విన్స్ అయ్యాడు..శాండిల్య .

ఇంటర్ కాంలో ..క్రైంబ్రాంచ్ డియస్పి కి ఏం చేయాలో వివరించాడు. యుకెన్ ప్రొసీడ్ అన్నట్లు..బాలికి సిగ్నల్ యిచ్చాడు.బాలి సిగ్నల్ అందుకుంటూనే "శిరీష " తన బేగ్ లోంచి సెల్ తీసి ఓ నెంబర్ డైల్ చేసింది.సెల్ రింగవుతున్న శబ్దం స్పీకర్ లోంచి స్పష్టంగా వినిపిస్తుంటే అందరూ హార్ట్ బీట్ ను మర్చి పోయినట్లు ఊపిరి బిగపట్టారు.

"యస్ దిసీజ్ సిఐ బాలా గౌడ్ .. హు హీజ్ ఆన్ దలైన్ " ?

"సర్ ! నాపేరు అనిత..గాంధీ హాస్పిటల్ స్టాఫ్ మెంబర్ని.మీ స్టేషన్ నుంచి మొన్న కిషన్ మల్హోత్రా అనే స్టూడెంట్ డెడ్ బాడీని పోస్టుమార్టం చేసాం..ఆ స్టూడెంటు షర్ట్ బటన్ లో ఓ మినియేచర్ బగ్..కన్పించింది.దాన్ని మా డాక్టర్ గారు ఎనాలసిస్ చేయించారు .

మాటలు ఆపేసింది

"సో వాట్?"

" అందులో మీరూ మరో పోలీస్ కలిసి ఆ స్టూడెంట్ ని మర్డర్ చేస్తున్నట్లు..రికార్డయ్యింది సర్.

భయంకరమైన నిశ్శబ్దం..అటు ఫోను ఇటు రూంలో. యస్ ఫిష్ ఇన్ ద నెట్ ..అన్నట్లు బాలి శిరీషకు సిగ్నల్ పాస్ చేశాడు.

"ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నావ్..నీతో యింకెవరున్నారు ?

సిఐ కంఠంలో వైబ్రేషన్స్..స్పష్టం గా విని పిస్తుంటే అయోమయంగా చూశాడు..ఏసీపీ.

"నాతోబాటు మా డాక్టర్ సర్ వున్నారు.మీతో మాట్లాడతారట లైన్లో వుండండి "

అవినాష్ ఫోను తీసుకున్నాడు.

“గుడీవినింగ్ సీఐ సార్. మరీ పోలీసులే హంతకులైతే ..ప్రజల్ని ...

“సోదాపి ఎక్కడున్నావో చెప్పు ..నేను వచ్చి మాట్లాడుతా.”

“చెప్తాను సార్..దానికంటే ముందు మనం బేరం మాట్లాడుకుందాం..”

“నువ్వు చెప్పేది నిజమని చూసేదాకా నమ్మను”

“అయితే చూసిన తర్వాతే ..కానీ ..మా మినిమం కోట్ టెన్ సి ఆర్..ఓకే అంటేనే అడ్రస్. లేదంటే బొచ్చెడు చానల్స్“

“ఓకే కానీ అంత ఎమౌంట్ ఒక్కసారిగా..”

కాన్వర్ సేషన్ వింటూనే..క్రైంబ్రాంచ్ డియస్పీకి ఆర్డర్స్ పాస్ చేశాడు..ఏసీపీ.

“అర గంటలో వస్తే క్లిప్పింగ్సు చూపిస్తాం..చూశాక రేటు మాట్లాడుకుందాం..లేదంటే..’

“డా క్టర్ !తొందర పడొద్దు..ఐ విల్ బి దేర్ వితిన్నే హాఫేనవర్..టెల్ ద అడ్రస్..”

*****

క్రైం బ్రాంచ్ లో జరిగిన సమావేశానికి..అన్ని చానెల్స్ తో బాటు..కమీషనర్ స్థాయి అధికారులు కూడా హాజరయ్యారు.

ఏసీపీ శాండిల్య      కేసుకు సంబంధించిన వివరాలు      బ్రీఫ్ చేశారు.

డిటెక్టివ్ బాలి లేచాడు.

" ఖాకీలకు బ్రెయిన్ వున్నా అధికారాన్నే..ఎక్కువ యూజ్ చేస్తారనే నానుడి నిజమయ్యింది ఈ కేసుకు క్లూ అయ్యింది. ఎవిడెన్స్ లేకుండా మర్డర్ చేయాలని ఆన్ డ్యూటీ నాటకమాడిన హంతకుడు..తన స్టేషన్ ఎదురుగా వున్న అపార్ట్ మెంటు సీసీ కెమారాని విస్మరించాడు. ఆ రాత్రి హంతకులిద్దరూ ఔటాఫ్ స్టేషన్ అన్న రిపోర్టు రాగానే నేను ఆసీసీ కెమారా క్లిప్పింగ్స్ చూశాను .రాత్రి ట్వెల్వోక్లాక్ ఎస్సై డిపార్చర్ ట్వెల్వ్ ఫిఫ్టీన్ కు హంతకుల ఎంట్రీ రికార్డయ్యాయి. యూ పీపుల్ కెన్ హేవ్ ద క్లిప్పింగ్స్..ఫ్రం ద డిపార్ట్ మెంట్.ఎంతటి నేరస్తుడైనా తప్పు తప్పక చేస్తాడనేది..మరోసారి ప్రూవయ్యింది. నిజాయితీ పరుడైన మిస్టర్ శాండిల్య సహకారం అమేజింగ్."

ప్రెస్ తో బాటు అన్ని ఛానల్స్      తర్డ్ ఐ డిటెక్టివ్ ఏజన్సీని ఆకాశానికెత్తేశాయి. కమీషనర్ లేచి

"కులమతాలేకాదు రాష్ట్రాలకూ దేశాలకూ మధ్య హద్దులు చెరిగి పోయాయి.నార్తిండియన్ తన కులం కాదన్న చిన్న కారణంతో మా డిపార్ట్ మెంటు వ్యక్తి అందులోనూ హైకేడర్ వ్యక్తి యింత దారుణానికి తెగించాడంటే వెరీ పిటీ.ఈ కేసును ఐదు రోజుల్లోనే ఛేదించిన తర్డ్ ఐ డిటెక్టివ్ ఏజన్సీ బాలి గారికీ అతని ఎంటైర్ టీం మెంబర్స్ కు మా డిపార్ట్ మెంటు తరఫున ధన్యవాదములు తెలియచేస్తున్నాను.

"సర్ ! ఇంతవరకూ హంతకుడిని చూపించలేదు..          మరో డిపార్టుమెంటు వ్యక్తి సాయంతో అన్నారు.క్లారిటీ యివ్వలేదు." ఈ మధ్య యాంకరవ్వాలనే తపనతో తపించి పోతున్న ఓ క్రైం ఛానల్ రిపోర్టర్ నత్తికొండ నాంచారు సెల్ఫీపోజులో అడిగింది "ఐ విల్ టెల్."

ఏసీపీ లేచారు.

"క్రైంజరిగిన రాత్రి ట్వెల్వో క్లాక్కిఎస్సై రిపోర్టు చేసి వెళ్లి పోగానే డ్యూటీ లో వున్న హెడ్ సాయంతో      సీ ఐ మర్డర్ చేశాడు. ఎలిబీ కోసం ఇద్దరూ ఔటాఫ్ స్టేషన్ నాటకమాడారు.ఆ నాటకమే తన పాలిటి శాపమవుతుందని..అదే ఈ కేసులో విట్నెస్ అవుతుందని ఆ క్రిమినల్ బ్రెయిన్ ఊహించలేక పోయింది .      హెడ్ కానిస్టేబుల్ ఈ కేసును      తర్డ్ ఐ కి అప్ప చెప్పగానే అండర్ గ్రౌండ్ కెళ్లి పోయాడు. ఆల్రెడీ స్పెషల్ టీమ్స్ ఆర్ ఆఫ్టర్ హిమ్. స్టిప్యులేటెడ్ టైంలో కేసు సాల్వ్ చేసిన బాలి బృందానికి కృతజ్ఞతలు.కమీషనర్ ఆర్డర్ తో చేతికి బేడీలతో తలవంచుకున్న బాలాగౌడుని..మీడియా ముందు ప్రవేశ పెట్టారు.

****

అందరికీ వీడ్కోలు చెప్పివెళ్ళా దగ్గరకొస్తున్న అవినాష్ స్టెల్లా కాల్ కు ఆన్సర్ చేసి..బాలితో

బాస్ ! ఎవరో మీ అభిమానట .ఏజ్ దాదపు సెవెంటీ..బట్ వెరీఎనర్జిటిక్ అట.. ఏదో కేసంటూ గంటనుంచి వెయిటింగంట…




కాలేజిలో ఫెస్ట్ జరుగులోంది…

అందరూ మంచి ఉత్సాహంగా మ్యూజికల్ నైట్ ని ఎంజాయ్ చేస్తున్నారు. మొదటిసారి జ్యోత్స్న , శ్రీ ముద్దు పెట్టుకోవడం చూసా. అప్పుడే అర్థం అయ్యింది నేను రెండు నెలలుగా విన్నదంతా నిజమని. ఒక్కసారిగా ఆ గోల అంతా నిశ్శబ్దంగా అనిపించింది. ఆ వింత విద్యుత్ దీపాలలో కూడా చీకటి కనపడింది. నన్ను అడగకుండానే కళ్ళ నుండి కన్నీళ్ళు వర్షించాయి. నా ప్రమేయం

లేకుండానే మనసులో అంతర్యుద్ధం మొదలైంది. మనం విడిపోదాం అని తాను నాతో అంటే, కొంచెం గ్యాప్ కోసమేమో అనుకున్నా, కానీ, ఇది నేను అస్సలు ఊహించలేదు. శ్రీ, జ్యో ల విషయం ఎంతమంది చెప్పినా నేను వినలేదు. ఆ ప్రదేశం అంతా స్వార్థం, కుళ్ళు తో పేరుకుపోయిన నరకంలా కనపడుతోంది. అక్కడి మనుషుల కేరింతలన్నీ రాక్షసుల హాహాకారాలుగా వినపడుతున్నాయి.

ఈ గోల నుంచి బయటకి వచ్చాను. ఏవేవో ఆలోచనలు..ఎన్నెన్నో జ్ఞాపకాలు నా కళ్ళముందు కదలాడుతున్నాయి. సరిగ్గా అదే సమయానికి ఒక తీయటి గొంతు తో ఎవరో నా పేరు పిలిచారు.

" హలో విజయ్ గారూ "

" విజయ్ గారా? ఎవరు నువ్వు..?" నన్ను గారు అని పిలవడంతో ఆశ్చర్యంగా చూసాను.

ఓహ్హ్..నాపేరు సత్య, మీ జూనియర్ ని."

" మరీ అంత మర్యాద అవసరం లేదు, నా పేరు నీకెలా తెలుసు?"

" మీరు, సారీ, నువ్వు కాలేజ్ ఆన్యువల్ మాగజైన్ లో రాసిన కవిత చదివాను....అది నాకు చాలా చాలా నచ్చింది. అందులో యూత్ లో కలిగే లవ్, ఎమోషన్స్ ని బాగా రాసారు."

" ఓహ్హ్...ఇంకా కవితలు చదివేవాళ్ళు ఉన్నారా, నైస్, !! అంతలా నచ్చింది అంటున్నావు, నువ్వెవరినైనా లవ్ చేసావా?"

" లేదు లేదు, కొన్ని విషయాలు అనుభవించాల్సిన అవసరం లేదు. అర్థం తెలిస్తే చాలు. అవును, దిన్నర్ స్టర్ట్ అయినట్టుంది, పదండి, జాయిన్ అవుదాం, "

" హా, పాండి, దానికోసమే వచ్చినట్టున్నారు..."

ఆ రాత్రి సత్యతో చాలా విషయాలు మాట్లాడాను. తన చిలిపి మాటలకి నేను ఉన్న పరిస్థితిని మొత్తం మర్చిపోయా. మా మొబైల్ నంబర్స్, సోషల్ మీడియా సమాచారాలు మార్చుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు.

తర్వాతి రోజు పొద్దున్నే ఫేస్ బుక్ లో హాఇ అని మెస్సేజ్ తో మొదలైన మా బాతాఖానీ రాత్రికి ఫోన్లో బై, గుడనైట్ తో ముగిసింది. నా ప్రేమ విఫలానికి సంప్రదాయంగా ఏ మందో సిగరెట్టో మొదలుపెట్టాల్సిందిపోయి మళ్ళీ అదే ప్రేమ పుస్తకాన్ని మొదలు పెట్టాను. నాకిక కాలేజ్ లో మిగిలింది రెండు నెలలే. ఇలాంటివి వద్దు అనుకున్నా కానీ, అన్నీ అనుకున్నట్టు జరిగితే దీనెమ్మ దీన్ని జీవితం అని ఎందుకంటారు? చాలా అంటే మాట్లాడేసుకున్నాం. చిన్ననాటి చిన్న చిన్న సంగతుల నుంచి, కలలలోని పెద్దపెద్ద విషయాల వరకూ మాట్లాడుకున్నాం. మా మాటలు ఫోన్ ల నుండి నేరుగా రోడ్లమీదకి, అటునుండి కాఫీ షాప్ దాకా వెళ్ళాయి.

జ్యో నేను కూర్చునే అదే కాఫీ షాప్ లొ అదే టేబుల్ మీద సత్య కోసం వెయిటింగ్. మనసులో ఎన్నో ఆలోచనలు. మళ్ళీ నేను ఇలా ఉన్నానంతే కారణం సత్యనే. పగిలిన ఈ హృదయానికి తనకు తెలియకుండానే ఓదార్పునిచ్చింది. అసలే ట్రాక్ తప్పిన ట్రైన్ మళ్ళీ పట్టాలు ఎక్కించడం తప్పో-ఒప్పో తెలియడం లేదు. ఇన్ని భిన్న ఆలోచనల మధ్య నేను మునిగి తేలుతుండగా సత్య వచ్చింది.

" సారీ, లేట్ అయ్యింది, ఆర్డర్ ఇచ్చావా??"

" ఇచాను, మనకి అదే ముఖ్యం కదా, మనుషులు అవసరం లేదు.."

" అబ్బా, సరే ఏదో చెప్పాలన్నావ్? "

" అదే, నేను ఇంకోపది రోజులలో క్యాంపస్ నుంచి వెళ్ళిపోతున్నాను కదా, నిన్ను ఒకటి అడగాలి.."

" ఏంటి? ఎగ్జాంస్ కి ఏదైనా హెల్ప్చెయ్యాలా, లేక అప్పేమైనా కావాలా? "

" ఎహే, అది కాదు, "

" లవ్ చేస్తున్నావా? నన్నేనా? లేక మా ఫ్రెండ్ నెవరినైనానా?"

" పర్లేదు, నేననుకున్నంత తింగరిదానివి కాదు..!! అయినా నేను చాలా చెప్పాలి అనుకుని వచ్చా. ఫస్ట్ టైం ది ఎలాగూ పోయింది కనుక సెకండ టైం ది అయినా బాగా చెప్పాలి అనుకున్నా...నేను నోరు జారిన సంగతి అర్థం అయ్యి.

అయ్యో, నువ్వు సెకండ్ హ్యాండా? మా పద్దు అంటూనే ఉంది...నాలుగేళ్ళు ఖాళీగా ఎందుకుంటాడే? అని, ఇంతకీ ఎవరు తాను?"

" మా బ్యాచ్ లో జ్యోత్స్న తెలుసుగా, "

" ఓహ్హ్.... తన తేనే కళ్ళు, చొట్ట బుగ్గలు, ఉంగరాల జుట్టు..."

"ఎస్...తనే....."

" ఏం జరిగిందసలు?"

" నాకు ఈ విషాద గాథ సాగదీయడం ఇష్టం లేదు చిన్నగా చెప్పేస్తా...సెకండ ఇయర్ సమ్మర్ హాలిడేస్ లో రెండు నెలలు కేరళలో ఇండస్ట్రియల్ ట్రిప్ కి వెళ్ళిన బ్యాచ్ లో మేము ఇద్దరమే తెలుగు వాళ్ళం. దాంతో బాగా కలిసి తిరిగాం. ఒక బలహీనమైన క్షణంలో మణిరత్నం సినిమాల్లో లాంటి లొకేషన్ లో ఇళయరాజా రీరికార్డింగ్ లో మేము లవ్ చేసుకోవడం స్టార్ట్ అయ్యింది. ఒక సంవత్సరం బాగానే గడిచింది. ఆ తర్వాత మాకు క్యాంపస్ ప్లేస్ మెంట్స్ మొదలయ్యాయి. ఎప్పుడూ తన వెంట పడే శ్రీ కి బెంగళూరులో ఒకే కంపెనీలో జాబ్ వచ్చింది. ఇంకేముంది, ఇక్కడ బ్రేకప్ అక్కడ ప్యాచప్...అన్నీ నా ప్రమేయం లేకుండానే జరిగిపోయాయి. ఈ విషయం మా ఫ్రెండ్స్ అందరికీ తెలిసాక చివరకు నాకు తెలిసింది..ఇదీ జరిగింది.."

" అంతేనా? ఇంకేమీ జరగలేదా?"

" అంతేలే, మీ అమ్మాయిలకి ఇవన్నీ బాగా అలవాటేగా? " అంటూ కాఫీ షాప్ నుండి బయటికి వచ్చాము.

" మీ అబ్బాయిలకి ప్రతిదానికీ అమ్మాయిలందర్నీ ఒక్కటి చేశి మాట్లాడటం అలవాటు..."

" ఇప్పుడు నువ్వు చేసింది ఏమిటొ....సర్లే, ముందు నేను చెప్పిందాని గురించి ఆలోచించు..."

" బాబూ...ఇప్పుడు నువ్వు ఏం చెప్పలేదు, తెలుస్తుందా..."

" అర్థం అయ్యాక మళ్ళీ చెప్పడం ఎందుకు?"

" నీకు ఇంకో విషయం తెలుసా, నాకు ఈ జ్యోతి సంగతి ముందే తెలుసు."

" " అంటే , నా గురించి ఎంక్వైరీలు కూడా చేస్తున్నావన్న మాట. మరి తెలిసీ ఎందుకు అడిగావు?"

" నువ్వు విషాద ప్రేమ కథని ఎలా రిసీవ్ చేసుకున్నావో అని..."

ఇంతలో సత్య ఫ్రెండ్ పద్మ వచ్చింది.

నేను తనకి బై చెబుతూ " సర్లే, నా కథ వదిలేసి మన కథ గురించి ఆలోచించు..." చూస్తుండగానే ఆ పదిరోజులూ అవడం, స్టూడెంట్ కార్డు పోయి ఎంప్లాయ్ కార్డు రావడం చకచకా జరిగిపోయాయి. తనకి క్యాంపస్ ప్లేస్ మెంట్స్ లో బెంగళూరులో జాబ్ వచ్చింది. అంతా బాగానే వుంది అనుకున్న సమయానికి తను బెంగళూరు వెళ్ళినప్పటినుండి ఒక కాల్ లేదు, ఒక మెస్సేజ్ లేదు, నేను ఎప్పుడైనా చేసినా, అప్పుడప్పుడు ఎత్తడం ఏదేదో రాంగ్ కాల్ అన్నట్టుగా అరాకొరా మాటలు మాత్రమే. నాకు ఇక్కడ పిచ్చెక్కిపోతున్నట్టుండేది..ఎంత ప్రయత్నించినా సమాధానం దొరికేది కాదు. నా ఆత్రం అనుమానం గా మారింది. బెంగళూరు వెళ్ళాలనే నిర్ణయించుకున్నా.

తన     ఫ్రెండ్ ద్వారా తన కంపెనీ అడ్రెస్ తెలుసుకుని నేరుగా అక్కడికే వెళ్ళి తనని పిలవమని రిసెప్షన్ లో వెయిట్ చేస్తూ ఉన్నా....ఇంతలో తను రానే వచ్చింది. తను మొత్తం మారిపోయింది. తన నడక, తన చూపు, వైఖరి అన్నీ కొత్తగా ఉన్నాయి. నాకు తెలిసిన సత్య కాదు తను.....నన్ను చూసిన ఆనందం కానీ, ఆశ్చర్యం కానీ ఆమె కళ్ళల్లో కించిత్ లేదన్న విషయం గ్రహించడానికెంతోసేపు పట్టలేదు నాకు.

" ఎంకొచ్చావ"న్నట్టుగా కళ్ళతోనే సైగ చేసింది....

ఇక్కడ కాదు, అని కాఫీ షాప్ కి తీసుకుని వెళ్ళాను. తననలా చూస్తూనే ఉన్నాను. ఇన్ని రోజులూ ఎందుకు మాట్లాడలేదు అని నిలదీయాలనుంది..

" ఇంతలో సత్య, " ఎందుకొచ్చావో త్వరగా చెప్పు, నాకు టైం లేదు." అంది.

" నేను కాదు చెప్పల్సింది, నువ్వే అనుకుంటా?"

" సరే, నాకు ఇంకా లేట్ చేయాలని లేదు, ఇంకో రెండు వారాలలో నా మారేజ్."

" ఏమన్నావ్?" తాను అన్నది నాకు నిజంగానే వినపడలేదు.


" ఓకే, స్ట్రెయిట్ గా పాయింట్ కి వచ్చేస్తా. వచ్చే వారం కి పై వారమే నా పెళ్ళి. నువ్వు నాకు ప్రపోజ్ చేయకముందే నాకు ఎంగేజ్ మెంట్ జరిగిపోయింది. మా డాడీ ఫ్రెండ్ వాళ్ళ అబ్బాయి రోహిత్ తో. నాకూ రోహిత్ చిన్నప్పట్నుంచి తెలుసు. ఎప్పటి నుంచో అమెరికా వెళ్ళాలి అన్నది నా డ్రీం. రోహిత్ వాళ్ళ ఫామిలి అమెరికాలోనే స్తిరపడ్డరు. నీకు మొత్తం అర్థం అయ్యిందనే అనుకుంటున్నాను."

తాను అలా చెప్తూంటే నా కళ్ళల్లో కన్నీళ్ళకి బదులు మొహంలో నవ్వొస్తోంది...తాను చెప్పిందంతా అర్థం అవుతోంది అయినా సరే, ఏమీ మాట్లాడలేకపోతున్నా. శరీరమంతా తేలికగా మారినట్లనిపిస్తోంది.

ఆ తడబాటులోంచే తెలివి తెచ్చుకుని " మరీ ఇంతా తెలిసి నన్నెందుకు ఈ కథలోకి లాగావు?" అని అడిగా.

అప్పటికి రెడీగా ఉంచుకున్న సమాధానం వదిలింది...సులభంగా..." నేను నిన్ను ఫ్రెండ్ లాగానే చూసానుగానీ నువ్వే ఎక్కువ ఊహించుకున్నావ్. నేను కూడా క్యాంపస్ లో అందరికీ బాయ్ ఫ్రెండ్స్ ఉండడం చూసి టెంపరరీగా నిన్ను వాడుకున్నా...ఈ రోజులలో ఇవన్నీ కామనే కదా...."అంటూ ఇంకా ఏదేదో చెబుతోంది...

ఇంకా నా వల్ల కాలేదు, తెలియకుండానే కాఫీ బిల్లు అక్కడ పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా నడవడం మొదలుపెట్టాను. చుట్టొ వెలుతురున్నా, కళ్ళు కనిపించడం లేదు. ఒక్క క్షణం తాను చెప్పింది అబద్ధం అయితే బాగుండు అనుకుంటున్నా కానీ కాదు. తన కళ్ళల్లో ధైర్యం, మాటల్లో తెగింపు చూస్తే ఎవ్వరికీ అది అబద్ధం అనిపించదు. సత్య నాకు చేసిన దానిమీద ఎందుకో కోపం రావటం లేదు. తాను నా ముందు చేసింది అంతా నటన అంటే ఆశ్చర్యంగా ఉంది. బుర్రలో ఎవరో శూలాలు దింపుతున్నట్టు ఉంది. ఈ జీవితం మనకెంతో చెపుతుంది. అందులో ఎన్నో కథలు దుఖంతో అంతమయ్యేవే... మనతో ఏ వస్తువు గానీ మనిషి గానీ పరిపూర్ణంగా వుండరు. ఏడుపుతో మొదలై, ఏడుపుతో ముగిసేదే మన జీవితం. అందుకే మనం అందులోనే ఆనంద క్షణాలని మాత్రమే గుర్తుంచుకోవాలి.



ప్రొఫెసర్ దేవి ప్రసాద్ ప్రొద్దునే 6 గంటలకు నిద్ర లేచి వాకింగ్ కి బయల్దేరారు. ఆయన ఉన్న గేటెడ్ కమ్యూనిటీ కాలనీ లో చక్కటి రోడ్లు ఒక చిన్న పార్క్ వుంది. కాలనీ వాసుల వాకింగ్ కి అది అనువైన కాలనీ. ప్రొఫెసర్ అందరికి హలో చెబుతూ నెమ్మదిగా పార్క్కు దగ్గరికి చేరారు. వాకింగ్ అయిన తరువాత కాసేపు మిత్రులతో మాట్లాడటం ఆయన దిన చర్య.

ప్రొఫెసర్ పార్క్ లోని బెంచి మీద కూర్చొని ఎవరైనా వస్తారేమో అని ఎదురుచూస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగి సురేష్ అక్కడికి నవ్వుతూ చేరుకొన్నాడు. "గుడ్ మార్నింగ్ ప్రొఫెసర్ గారు, ఇంకా మనవాళ్ళు ఎవరు రాలేదా "

"ఇంకా ఎవరు రాలేదు , వస్తారులెండి నెమ్మదిగా "

"మీ వాడు వుద్యోగం ఎలా ఉందంటున్నాడు. కొత్త ఏరియా కదా. చదివింది ఇంజనీరింగ్, చేరింది టూరిజం కంపెనీ లో "

" ఏమో తెలిదు , వాడు అన్ని వాళ్ళ అమ్మకే చెబుతాడు. ఆఫీస్ కి అయితే రోజు వెళుతున్నాడు " అన్నారు నవ్వుతూ.

కొద్ది సేపు మాట్లాడుకున్నాక ఇద్దరు ఇళ్లకు బయల్దేరారు.

ప్రొఫెసర్ గారు ఇంటికి వచ్చేటప్పటికి 8 గంటలు కావస్తున్నది. కొడుకు మురళి ఆఫీస్ కి పోవటానికి తయారవుతున్నాడు. మురళి ఇంజనీరింగ్ పూర్తిచేసి తనకు ఇష్టమైన టూరిజం రంగంలో మూడేళ్ళ నుండి వుద్యోగం చేస్తున్నాడు. మురళి కి ఆధునికంగా జీవించటం, కొత్త ప్రదేశాలకు వెళ్ళటం అంటే మక్కువ. తనకు సొంతంగా ఏదైనా పర్యాటక వ్యాపారం ఉండాలని కలలు కంటున్నాడు. ఇప్పుడు పనిచేస్తున్న కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్ , అనేక పర్యాటక ప్రాంతాలకి గ్రూప్ విజిటింగ్ ఏర్పాటు చేస్తుంటాడు, అందులో విదేశీ ప్రయాణాలు కూడా ఉంటాయి. ఈ ఉద్యోగంలో చాలా మందితో పరిచయాలు పెరిగాయి. అందులో తనకు ముఖ్యమైన వ్యక్తి ఎయిర్ బుకింగ్ లో పనిచేసే గీత.

అమ్మా ఆఫీస్ కి వెళుతున్నాను" అన్నాడు మురళి

"అలాగే, మరీ లేట్ చేయకుండా ఇంటికి వచ్చేయి" అమ్మ .

సోఫా లో కూర్చొని పేపర్ చదువుతున్న నాన్న వంక చూస్తూ బయటకి వచ్చాడు. ఇద్దరూ చాలా తక్కువుగా మాట్లాడుకొంటారు. ప్రొఫెసర్ పేపర్ చదవటం పూర్తి చేసి పైనున్న తన స్టడీ రూమ్ లోకి వెళ్లారు, అది ఆయన ప్రపంచం.

**********

దేవి ప్రసాద్ యూనివర్సిటీ లో ఆర్కియాలజి డిపార్ట్ మెంట్ లో ప్రొఫెసర్ గా పనిచేసి అయిదు సంవత్సరాల క్రిందే రిటైర్ అయ్యారు. నలభై సంవత్సరాలుగా ఆయనకు వుద్యోగం కాక ఉన్న ఒకే ఒక హాబి పోస్టల్ స్టాంపుల సేకరణ, ఫిలాటిలే. రిటైర్ అయిన తరువాత అదే ముఖ్య వ్యాపకం అయింది.

ప్రపంచం లోని స్టాంపుల సేకరణ ,దాని వెనుక వున్న చరిత్రా పరిజ్ఞానం , ఆయనకు వున్న ప్రత్యేకత. 1852 నుండి స్టాంపులు ప్రపంచం లోకి వచ్చాయి . దేశ భౌగోళిక చారిత్రాత్మక అనుసరించి స్టాంపులు సేకరణ జరిగేది, కోటలు, రైళ్లు, ఓడలు, పోస్ట్ ఆఫీస్ భవంతులు, రాజులు ,రాణులు,పక్షులు,జంతువులు,దేశ జెండాలు ,పర్యాటక భవనాలు, సైన్యానికి, నేవీ కి సంబంధించినవి, ఇంకా ఎన్నో రకాలు.

ప్రొఫెసర్ తన జీవన సమయాన్ని సమస్త ఆదాయాన్ని ఫిలాటిలే లోనే వెచ్చించారు . ఇండియా,అమెరికా,బ్రిటన్, జర్మన్, ఫ్రాన్స్ దేశాల్లోని స్టాంపుల సేకరణ క్లబ్బులో అంతర్జాతీయ సభ్యత్వం వుంది. ప్రపంచంలో కొన్ని వేలమంది ఈ వృత్తి లో ఉన్నా, పూర్తిగా అంతర్జాతీయ స్థాయికి చేరినవారు వందల్లోనే వుంటారు, అందులో ఒకరు ప్రొఫెసర్ దేవి ప్రసాద్.

ఆయన దగ్గర ఉన్నా స్టాంపుల కలెక్షన్ అమూల్యమైనవని క్లబ్ మెంబెర్స్ అందరికి తెలుసు. ఆయన కలెక్షన్ లో ముఖ్యమైనవి బ్రిటన్,అమెరికా,ఇండియా,చైనా లోని పురాతన రైళ్ల , కోటలు, పోస్ట్ ఆఫీస్ భవనాలు, దేశ జెండాలు. ఢిల్లీ,ముంబై,కలకత్తా ఇంకా ముఖ్యమైన నగరాల్లోని స్టాంపుల ప్రదర్శనకి తప్పక హాజరు అవుతూ, ఇంటర్నెట్ ద్వారా అంతర్జాతీయ క్లబ్ మెంబెర్స్ తో సంబంధాలు పెట్టుకొంటూ, స్టాంపుల కొనుగోలు, బదిలీలు చేస్తూ ఒక శిఖరానికి చేరాడు. ఆయన ఈ రంగంలో మహర్షి అనే చెప్పవచ్చు. చాల మంది దీన్ని మంచి వ్యాపారంగా మలుచుకొని లక్షలు సంపాదిస్తున్నారు. ప్రొఫెసర్ మాత్రం స్టాంపుల సేకరణని ఒక యజ్ఞంగా భావిస్తున్నారు. దాదాపుగా 2000 స్టాంపులు పోగైనాయి, వాటి విలువ ఆయనకు తెలుసు.

ప్రొఫెసర్ ఇంటర్నెట్ లో స్టాంప్ డీలర్లు దేశ విదేశీ క్లబ్ మెంబర్లతో చాటింగ్ ఇమెయిల్ మొదలైన పనులతో దిన చర్య మొదలు పెట్టారు. తన స్టాంప్ కలెక్షన్ కి సంబంధించిన "ట్రెజర్ అఫ్ దేవి ప్రసాద్ " కాటలాగ్ వాల్యూం 5 ని ఇంటర్నేషనల్ వెబ్సైట్ లో

అప్ లోడ్ చేసారు. దానిలో దేశ విదేశానికి సంబంధించిన 415 చారిత్రాత్మక పురాతన విమానాల స్టాంపులు వున్నాయి. ప్రతి ఏడు ఎనిమిది సంవత్సరాలకి లేటెస్ట్ కలెక్షన్ కేటలాగ్ రూపంలో రిలీజ్ చేస్తారు. కంప్యూటర్ తో పని అయిన తరువాత తాళం వేసిన అల్ మారా తెరచి రెండు స్టాక్ బుక్స్ ని బయటకు తీశారు, స్టాంపులు భద్రపరచటానికి ఆల్బం సైజ్ లో వుండే ప్లాస్టిక్ కవర్ల బుక్. అందులో స్టాంపులు సురక్షితంగా ఎంతకాలమైనా ఉంటాయి కొద్దిపాటి జాగ్రత్తలతో. స్టాక్ బుక్స్ లోని కొన్ని స్టాంపులను భూతద్దంతో దేనికోసమో చూసి మళ్ళీ వాటిని అల్ మారా లో పెట్టి తాళం వేశారు. ఆ రెండు స్టాక్ బుక్స్ అయన జీవిత కాల కష్ట ఫలం .

*************

"గీతా వస్తున్నావా, దర్బార్ రెస్టారెంట్ లో వెయిటింగ్, అప్పుడే 8 అయింది " మురళి

"ఆటో లో వున్నాను. ఇంకో పది నిముషాల్లో వచ్చేస్తాను" గీత.

వారి పరిచయం ప్రణయంగా మారింది. రోజు ఆఫీస్ పని పూర్తి అవగానే ఎక్కడో అక్కడ కలుసుకొంటారు. మురళి గీతల అభిరుచులు ,ఆకాంక్షలు ఒక మాదిరిగానే ఉంటాయి, అంటే విదేశాలకు వెళ్ళటం, ఆధునికంగా జీవితాన్ని గడపటం, ఏదైనా తమ సొంత వ్యాపారంలో స్థిరపడటం.

"ఏమిటి వచ్చి చాల సేపయిందా, ఈ రోజు ఫుల్ రష్ గా వుంది" అంటూ ఎదురు చైర్ లో కూర్చుంది నవ్వుకుంటూ.

"నాకు ఈ రోజు పెద్ద పని లేదు, ఇంకా ఏమిటి న్యూస్ "

"ఏదైనా ఆర్డర్ చేద్దామా, డిన్నర్ అయితే లేట్ గా ఇంటికి చేరినా పరవాలేదు, ఒక పని అయిపోతుంది, రేపు సండే కూడా కదా"

"నో ప్రాబ్లెమ్, అలాగే చేద్దాం" అంటూ వెయిటర్ ని పిలిచి డిన్నర్ కి ఆర్డర్ ఇచ్చాడు మురళి

"రేపు సండే, ఏమిటి ప్లాన్, రేపన్నా చెబుతావా మన సంగతి మీ ఇంట్లో "నవ్వుతూ అంది

"తప్పకుండా, ఏ రోజైన చెప్పాల్సిందిగా, అమ్మ సరేనంటుంది, నాన్న కూడా కాదనుడులే, అంత పట్టించుకోడు "

"నాకు టెన్షన్ గా వుంది, నేనైతే ఈ రోజే చెప్పేస్తాను, ఒప్పుకుంటారనే అనుకుంటున్నాను "

"వర్రీ కాకు, అన్ని మనం అనుకున్నట్లుగానే జరుగుతాయి " అన్నాడు మురళి మృదువుగా గీత చెయ్యి నొక్కుతూ  వారు కోరుకొన్నట్లుగానే,  వివాహ చర్చలు సఫలంగా  పూర్తి అయి కొద్ది రోజుల్లోనే పెళ్లి కూడా అయిపొయింది. గీత మురళి ఇంటికి  పర్మినెంట్ వచ్చేసింది, కాలం ఎప్పటిలాగానే ఆఫీస్ ఇల్లు తో  గడిచిపోతుంది .

*********

"అమ్మ నాకు గీతకి మలేసియా టూరిజమ్ కంపెనీ లో ఆఫర్ వచ్చింది, మంచి జీతం, వెళ్దామనుకొంటున్నాము " అన్నాడు మురళి ఒక రోజు సాయంత్రం డిన్నర్ చేస్తూ.

"మలేషియానా, ఎందుకురా ఇక్కడే ఏదో చూసుకోక " అమ్మ

"ఏ కంపెనీ " నాన్న .  "మలేషియా హెవెన్స్" అని సమాధానమిచ్చాడు

"ఏదైనా జాగ్రత్తగా ఆలోచించుకొని చేరండి" నాన్న

"వెళ్ళమని చెబుతున్నారా " అమ్మ.  "అది వాళ్ళ ఇష్టం" నాన్న

"పర్మినెంటుగా కాదమ్మా, నాలుగు అయిదు సంవత్సరాలు ఉండి వచ్చేస్తాం" అన్నాడు మురళి నవ్వుతూ . " మలేషియా ఎంతో

దూరం కాదు, సంవత్సరానికి ఒకసారి వారం పదిరోజులుండి పోవచ్చు" మురళి అమ్మని ఒప్పించే ప్రయత్నంలో వున్నాడు.

ఆ విధంగా ఒక అరగంట సంభాషణ జరిగిన తరువాత మురళి ఆమ్మ అయిష్టంగానే సరే అంది. మురళి నాన్నకి తెలుసు మురళికి ఒకసారి ఆలోచన వస్తే ఇక ఆగదని.

"ఇంతకీ ఎప్పుడని అనుకుంటున్నారు " అమ్మ

"ఇంకో నెల రోజులు పడుతుంది" మురళి

గీతకి సంభాషణ సఫలమైనందుకు సంతోషంగా ఉంది.

*********

మురళి గీత మలేషియా వెళ్లే రోజు రానే వచ్చింది. అయిన వారందరు వీడ్కోలు చెప్పటానికి మురళి ఇంటికి చేరుకొన్నారు, కౌలాలంపూర్ వయా ముంబై వెళుతున్నారు.

"ముంబై నుండి కౌలాలంపూర్ కి ఫ్లైట్ ఎన్నింటికిరా " మురళి అమ్మ

"రాత్రి 9 గంటలకి " మురళి

అందరి తోనూ కాసేపు మాట్లాడిన తరువాత అమ్మ నాన్నకి బాయ్ బాయ్ చెప్పి మురళి గీత ఎయిర్ పోర్ట్ కి బయల్దేరారు. గీత తల్లి తండ్రులు వారితో పటు ఎయిర్ పోర్ట్ కి వెళ్లారు.

***************

మురళి వెళ్లి రెండు నెలలు గడిచాయి. ప్రొఫెసర్ కంప్యూటర్ లో మెయిల్ చెక్ చేస్తూ రెండు రోజుల క్రితం లండన్ లో జరిగిన వరల్డ్ ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ వివరాలను చదువుతున్నారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా లోని ఆనాటి రైళ్లు, ఓడలు ,పోస్ట్ ఆఫీస్ బిల్డింగ్స్ ఇంకా ఎన్నో అరుదైన స్టాంపులు అందరిని ఆకర్షించాయిని, వాటి ఫోటోలు, కాటలాగులును కూడా లండన్ ఫిలాటెలి డైజెస్ట్ వెబ్సైటు లో పెట్టారు. చూస్తున్న కొద్దీ ప్రొఫెసర్ ముఖంలో రంగులు మారుతూ గంభీరంగా తయారైనారు. వొంట్లో ఏదో నిస్సత్తువ చోటు చేసుకొంది, నెమ్మదిగా లేచి అలిమారా లో వున్నా స్టాక్ బుక్స్ ని తీసి టేబుల్ మీద పెట్టి చెక్ చేయటం మొదలు పెట్టారు. వెనుక కుర్చీలో కుప్ప కూలి పోయారు, మెదడు పని చేయటం లేదు, అంతా సూన్యంగా వుంది. అలా ఎంతసేపు కుర్చున్నారో ఆయనకే తెలిదు.

కొద్దిసేపటి తరువాత తేరుకొని పద్మా అని తన భార్యని గట్టిగా పిలిచారు. పద్మ తొందరగా పైనున్న ప్రొఫెసర్ రూంకి వచ్చింది.

"ఏమైందండీ అంత గట్గా పిలిచారు" అంది అయన వంక స్టాక్ బుక్స్ వంక చూస్తూ.

"ఏమని చెప్పను, ఇందులో దాదాపుగా 1000 స్టాంపులు మాయమయ్యాయి "

"అంటే అర్థం కాలేదు నాకు, ఎలా పోయాయి అంటారు"

"ఎవరో తీసికెళ్లారు" అన్నారు, దొంగిలించారు అంటం ఇష్టం లేక

"మనింట్లో ఎవరు తీస్తారండి" అంది ప్రొఫెసర్ వంక చూస్తూ. ప్రొఫెసర్ ఆమెను చూస్తూ ఇంకా అర్థం కాలేదా అన్నట్లుగా నవ్వారు.

" మురళా, అంత పని చేసాడంటారా"

"స్టాంపులని ఇంటర్నేషనల్ మార్కెట్ లో అమ్మేశాడు. తీసికెళ్ళిన స్టాంపులు కూడా అత్యంత విలువైనవి తేలికగా అమ్ముడు పోయేవి."

అంటే మురళి తన చేసే పనిని రోజూ చూస్తూ సబ్జెక్టు మీద అవగహన పెంచుకున్నాడు. స్టాంపుల మార్కెట్ డీలర్లు గురుంచి తెలుసుకొన్నాడు. న రూమ్ ఎదురుకుండానే మురళి బెడ్ రూమ్, తను పడుకోటానికి క్రిందకి వెళ్ళినప్పుడు మురళి తన స్టడీ రూంలో పనిచేసే వాడన్న మాట. జరిగిన పనులన్నీ ప్రొఫెసర్ కంటికి సినిమా రీల్ లాగా కదలాడింది.

“విలువైనవి అంటున్నారు, ఎంత ఉంటాయి "

"సుమారుగా 6 కోట్లు ఉంటుంది " అని నెమ్మదిగా అన్నారు ప్రొఫెసర్

"ఆ 6 కోట్లా, మీరెప్పుడు నాకీ విషయం చెప్పలేదు, నేను లక్షల్లో ఉండొచ్చు అనుకొన్నాను, అయినా అది మీ హాబీ అని పట్టించు కోలేదు " మురళి అమ్మ కంట తడి పెట్టింది.

మురళి ఎందుకిలా చేసాడు, అంత అవసరం ఏమొచ్చింది. తను మొదటనుండి డబ్బుల విషయంలో చాల కట్టడిగా ఉండటంవలన ఈ పరిస్థితి వచ్చిందా. మురళికి అధునాతనంగా జివించాలని, విదేశాలలో తిరగాలని ఉంటుందని ప్రొఫెసర్ కి తెలుసు. మురళికి తనకి ఉన్న దూరమెంతో ప్రొఫెసర్ కి అర్ధమయ్యింది,

కాని ఈ విధానం ఎన్నుకొంటాడని ఎప్పుడు అనుకోలేదు.

" అయిపోయిందేదో అయిపోయింది, ఎవరకి చెప్పకండి, వాడితో మాట్లాడండి"


"ఎక్కడని మాట్లాడను"

"కౌలాలంపూర్ లో కంపెనీ పేరు చెప్పాడుగా"

"నేను చెక్ చేశాను, అలంటి కంపనీనే లేదు, అసలు వాడు మలేషియా వెళ్లాడనుకోవటల్లేదు " ఆ విధంగా వారి సంభాషణ భావోద్వేగాల మధ్య జరుగుతోంది.

*******

ఇండియా నుండి సుమారు 4300 కిలో మీటర్ల దూరంలో చైనా అధీనంలో వున్న, ప్రపంచంలోనే అత్యధిక క్యాసినోస్ ,గ్యాంబ్లింగ్ వ్యాపారం, టూరిజం ముఖ్య ఆధారంగా గుర్తింపువున్న ప్రసిద్ధమైన దేశం మకావ్. అక్కడ ఒక రెస్టారంట్ లో మురళి, గీత తాము చేయబోయే ఇండియన్ రెస్టారెంట్ ,టూరిజం వ్యాపారం గురిన్చి మాట్లాడుకొంటున్నారు. విదేశాల్లో వ్యాపారం చేస్తూ ధనాన్ని ఆర్జించి స్థిర పడాలనే కలని సాకారం చేసుకొనే దిశలో అడుగులు వేస్తున్నారు.




అప్పటి వరకూ అత్తగారి పెత్తనం డైలీ సీరియల్ చూస్తూ జాంకాయలు మేస్తున్న లక్ష్మమ్మగారు ,హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్టు ,అవును, రోజూ ఈ టైముకి నేను పాలు తాగుతానని తెల్సి కూడా ఇంకా ఈనా కోడలుపిల్ల నాకు పాలు తేలేదేంటి ,అవున్లే ,కొత్తలోనే కోడళ్ళు,తర్వాతేగా కొడవళ్ళుగా మారతారు, అనుకుంటూ కళ్ళు పెద్దగా చేసి ,నోరు పెద్దగా తెరిచి ,ఒసేవ్ లలితా ,ఎక్కడ చచ్చావ్ ?ఈ సమయానికి పాలు తాగుతానని తెల్సి కూడా ఇంకా తెచ్చి ఏడవలేదేమే ,అరిచిందామె.

ఆమె మాటలు విన్న లలిత, ఓ మారు ఉలిక్కిపడి ,తన బెడ్రూం లోంచి హాల్లోకి వచ్చి ,ఈ రోజూ నుండి మీరే కలుపుకు తాగండత్తయ్యా.నేను చదువుకోవాలి. కరస్పోండెన్స్ కోర్సు ద్వారా చేస్తున్న పి.జి పరీక్షలు దగ్గరకొచ్చాయి.చెప్పిందామె.

ఆ, ఆ .అత్త అంటే ఎంత అలక్ష్యం.ఎంత నిర్లక్ష్యం.పెళ్ళై మూడు సంవత్సరాలైనా ఇంకా తల్లివి కాలేకపోయావ్ కానీ ,నీకు ఇంత పొగరు ,అంత వగరూనూ.దెప్పి పొడిచిందామె.

ఆపండి.ఆ అరిగిపోయిన పాత ,రోత ,మోత రికార్డ్ .నేను తల్లిని కావాలంటే ఎప్పుడో అయ్యేదాన్నేమో. మీకు కోడల్ని కాకుండా వేరే అత్తకి కోడలిని అయ్యుంటే.

అవ్వ,అవ్వ ఎంత మాటన్నావే ముదనష్టప్పినుగా.గైమంది లక్ష్మమ్మ.

అవును అత్తయ్య .నిన్న డాక్టర్ గారిని కలిసినప్పుడు ,లోపం మీ అబ్బాయిలోనైనా ఉండొచ్చని చెప్పారు మరి. చెప్పింది లలిత .

ఓహో .ఆదా నీ నిర్లక్ష్యానికి కారణం.ఈ రోజు నా కొడుకు మీ ఇద్దరి ఫెర్టిలిటీ పరీక్షల ఫైనల్ రేపోర్ట్స్ తెస్తాడు.నీ నోటికి తాళం వేస్తాడు.లోపం నీలోనే ఉందని రిపోర్ట్స్ కూడా నిరూపిస్తాయి.అప్పుడు చూడు, నా కొడుకుని నొప్పించైనా, ఎవరితో చెప్పించైనా రెండో పెళ్ళికి ఒప్పించేస్తాను .నీ అంతు చూస్తాను.చెప్పిందామె యమ కసిగా.

అలాగా !ఒక వేళ మీ అబ్బాయిలో లోపం ఉన్నా, నేను రెండో పెళ్లి చేసుకోనులెండి.అయినా ఎలాగూ మీ అబ్బాయి వచ్చే టైమ్ కూడా అయింది.సినిమా చూడబోతూ రివ్యూ చదవడం ఎందుకు. కొంచెం ఓపిక పట్టండి.చెప్పిందామె,అత్తగారి వంక ఎర్రగా చూస్తూ.ఆమె అలా అంటుండగానే ఆఫీసు నుండి మధు వచ్చినట్టుగా బైక్ సౌండ్ వినిపించడంతో ,అత్తా కోడళ్ళిద్దరూ చిత్రంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.అంతలోనే మధు ,కాస్తంత నీరసంగా ,నెమ్మదిగా లోపలికి నడిచి వచ్చాడు.అతనలా వచ్చి సోఫాలో కూలబడి,బడగానే ,వచ్చావురా నాయినా.చూడరా, నీ పెళ్ళాం చాలా ముదురు మాటలు మాట్లాడుతోంది.నేను పాలు తెచ్చి ఇమ్మన్న పాపానికి నన్ను హేళన చేస్తూ నానా మాటలు మాట్లాడింది.కానీ ఏం చేయను ,నీ మొహం చూసి అన్నీ ఓపికగా భరిస్తున్నాను.అని చీర కొంగుతో ముక్కు చీదుకుని, ఓ క్షణం తరువాత ,అవున్నాయనా ,ఇంతకీ చేయించిన పరీక్షల్లో ఏం తేలిందిరా.అడిగిందామే కొండంత ఆశక్తిని కళ్ళలో నింపుకుని.

త్వరగా చెప్పేయెండి. పాపం ఇందాకటినుండి వేచి చూస్తున్నారు.లేదంటే ఆతృతతో ఆవిడ సుగర్ లెవెల్స్ పెరిగిపోతాయి. చెప్పింది లలిత వ్యంగ్యంగా.

వారి ఇద్దరి మాటలు విన్న మధు, పని లేకపోతే సరి.ఇదేమన్నా గుర్రపు పందెమా అంత ఆశక్తి చూపడానికి.ఇల్లు కాలి ఒకడేడిస్తే ,ఆ మంటలో వేడినీళ్లు కాచుకోనివ్వలేదని మరొకడేడ్చాడట.అలా ఉంది మీ వరస. అని ఓ నిట్టూర్పు విడిచి,ఇక రిపోర్ట్స్

విషయానికొస్తే, సంతానం కలగక పోవడానికి గల లోపం నాలోనే ఉంది అని రిపోర్ట్స్ కన్ఫర్మ్ చేశాయి . చెప్పాడు మరో నిట్టూర్పు విడిచి.మరుక్షణం తేరుకుని ,కొద్ది నెలలు ట్రీట్మెంట్ తీసుకుంటే ఈ సమస్య తీరిపోయి,నేను తండ్రయ్యే అవకాశం ఉందని చెప్పారు.చెప్పాడు మరింత నిరస పడిపోతూ .


కొడుకు మాటలు విన్న లక్ష్మమ్మకి కాళ్ళ కింద భూమి క్రుంగినట్టనిపించింది. మనసులో ఓ మూల దాగిన బాధ ఒళ్ళంతా వ్యాపించినట్టైంది. ఆ క్షణం లో కోడలి వైపు చూడ్డానికి కూడా ఆమెకి ధైర్యం రాలేదు. ఇన్నాళ్లూ ఆమెని గొడ్డుమోతు లాంటి ఎన్నో మాటలు అని బాధపెట్టాను.అత్త అనే అహంతో విర్రవీగాను.కాని ఇప్పుడు జరిగింది వేరు.అందుకే కాబోలు , దేవుడు నా అల్ప బుద్ధిని ఈరకంగా మరమత్తు చేశాడు, అని లోలోనే అనుకుని, ఏం కాదులేరా.ఈ రోజుల్లో చాలా అడ్వాన్స్డ్ మెడిసిన్ ఉంది.చెప్పిందామె, కొడుకు బుజం పై చేయి వేసి, తరువాత లోనికి నడుస్తూ.

లక్ష్మమ్మ గారి ముఖం ట్యూబు లైట్ కాంతి నుండి బెడ్ లైట్ కాంతికి పడిపోయి, డీలా పడిపోవడం లలితకి ఓ పక్క పిచ్చి ఆనందాన్ని కల్గించినా ,మరో పక్క ,ఛ ఆవిడ నోరు పాడు చేసుకుందని నేను కూడా అలానే అల్ప బుద్ధి తో నోరు పారేసుకోకుండా, వయసుకైనా మర్యాద ఇవ్వాల్సిందేమొ.అనుకుంది లోలోన .తర్వాత మధు వైపు చూసింది. అతను కొంచెం డల్ గా,కళ తప్పిన ముఖంతో కనిపించడం ఆమెకి ఎదోలా అనిపించింది. దాంతో ఆమె,అతని పక్కన కూర్చుని ,పోనీలెండి.బాధపడకండి.చెప్పిందామె ఓదార్పుగా .

బాధ దీని కోసం మాత్రమే కాదు.నా బాధంతా డబ్బు పోయినందుకే.చెప్పాడు మరింత దిగాలుగా. పోనీలెండి. జీవితాలే పోతున్నాయి .అలాంటిది మెడికల్ టెస్టులకి అయిన డబ్బు ఓ పెద్ద విషయమా చెప్పండి.పోతే పోయింది .పోనివ్వండి డబ్బు.దాని కోసం అంతలా బాధపడకండి.ప్లీజ్ .గడ్డం పట్టుకుంది బ్రతిమాలుతున్నట్టుగా.

ఆమె మాటలు విన్న మధు, ఆమె వంకే దీర్ఘంగా చూస్తూ ,మనసులో ,పిచ్చి శ్రీమతీ ,నేను బాధపడుతోంది మెడికల్ టెస్టులకి అయిన లక్ష గురించి కాదు. నా వల్లే నెల తప్పానని నాటకం ఆడి,బ్లాక్ మైల్ చేసి ,డబ్బిస్తే ,జీవితంలో ఇక మళ్ళీ కనిపించనని ,ఓ వారం క్రితం నా దగ్గర నాలుగు లక్షలు నొక్కేసిన మా ఆఫీసు డాటా ఎంట్రీ ఆపరేటర్ ఆ సురేకావల్లి గురించి.అయినా ఇది కూడా నా మంచికే జరిగింది.నా అల్ప బుద్ధికి తగిన శాస్తి జరిగింది.కొత్త అనుభవాల కోసం చెత్త దారులు తొక్కడం ఎప్పటికైనా చేటు అని తెలిసొచ్చింది.నేను ఒక రకంగా అదృష్టవంతుడ్ని.నాకు డబ్బులే పోయాయి.జీవితంలో మళ్ళీ సంపాదించుకోవచ్చు.అదే జీవితాలు పోయే పరిస్థితి వస్తే,ఎన్నటికీ తిరిగి సంపాదించుకోలేం.కనుక ఇక నుండి నా భార్యే నాకన్నీ అనుకుంటూ ,పశ్చ్యాత్తాపం నిండిన కళ్ళతో, ఆమెని దగ్గరకి తీసుకున్నాడు.

అసలు విషయం తెలియని లలిత, తనలో తాను,ఛ ,ఛ ,పాపిష్టి లోపం.నాలో ఉన్నా బావుణ్ణు. మనసులో ఆయనెంత బాధపడుతున్నారో పాపం,అని చెమర్చిన కళ్ళతో అతనికి మరింత చేరువైంది.




మూర్తి రాజు గారు వాళ్ళ ఇంటి ముందు వరండా లాంటి సిటౌట్ లో కూర్చుని చుట్టూ చెట్టూ చేమలతో నిండిన ప్రశాంత పరిసరాల్ని చూస్తూ ఉన్నా, ఆయనకి మనసులో చికాకు గానే ఉంది. చూసిన పేపర్ నే మళ్ళీ ఓమాటు తిరగేసి పక్కన పడేశారు.

వెనకాల హాలు లో ఉన్న ల్యాండ్ లైన్ ఫోన్ మ్రోగినా ఆయన లేచి వెళ్లి ఎత్తడానికి ప్రయత్నం చేయలేదు. ఇప్పటి ఇండియా టైం బట్టి కొడుకు రాజా కెనడా నుంచి చేసే ప్రశ్నే లేదు.

వంట ఇంట్లోంచి హడావిడి గా ఆయన భార్య శారదాంబ గారు వచ్చి ఫోన్ ఎత్తారు. . ఏదో రాంగ్ నెంబర్. మళ్ళీ వంట ఇంట్లోకి వెడుతూ " ఆ కార్డులెస్ కొనడం ఈ జన్మకు ఏమయినా జరిగే పనేనా? అని ఆయనకి వినపడేలా సణుగు కుంటూ వెళ్లారు.

కుర్చీలోంచి లేచి లోపలికి వచ్చి ఉయ్యాలా బల్ల మీద కూర్చుంటూ "కాఫీ ఇస్తావా అని వంట ఇంట్లోకి చూస్తూ అన్నారు" గట్టిగా.

ప్రొద్దుట ఏడింటికి ఒక మాటు తాగినా, పదకొండు గంటలకి మళ్ళీ ఓ కప్పు కాఫీ తాగడం ఆయనకి అలవాటు.

కాఫీ గ్లాసు తో వచ్చి ఆయనకి ఇచ్చి, తాను కూడా తెచ్చుకున్న గ్లాసు తో వచ్చి కూర్చున్నారు శారదాంబ గారు.

రాజా ఏ మయినా మెయిల్స్ గానీ పెట్టాడేమో చూడక పోయారా? అంది ఆవిడ. రాజా మెయిల్ పెట్టి ఉంటే, ఇంత సేపు చెప్పకుండా ఉండరని తెలిసినా.

ఆయన ఉయ్యాల మెల్లగా ఊపుతూ " నీ పిచ్చి గాని వాడికి మన మెక్కడ గుర్తు ఉంటాము? వాడి ఉద్యోగం, స్నేహితులే వాడి లోకం

ఏదో కల్యాణి మంచి పిల్ల కాబట్టి అప్పుడప్పుడు, ఆ అమ్మాయి అయినా మెసేజ్ లూ ఫోటో లూ అవీ పెడుతోంది" అన్నారు .

రామదాసు గురువుగారు అన్నట్టు ' భాగవతం చదువుకోండి. కొంచెం దృష్టి మళ్లుతుంది" అని లేచి గ్లాసులు తీసుకుని ఆవిడ వంటింట్లోకి నడిచింది.

ఉయ్యాల దిగి భాగవతం తెరిచి అందులో మునిగిపోయారు మూర్తి రాజు గారు .

***********

మూర్తి రాజు గారికి ఒక్కడే కొడుకు. రాజారావు అని ఆయన తండ్రి పేరే పెట్టుకున్నా చిన్నప్పటినుంచి 'రాజా' అని పిలవడం అలవాటు

చిన్నప్పటి నుంచి కొడుకుతో అటాచ్ మెంట్ ఎక్కువ. అందరి తండ్రులకీ కొడుకుల మీద అలా ఉండడం సహజమే కానీ ఇక్కడ ఒక కారణం ఉంది. రాజా చినప్పుడు మొదటి ఆరు సంవత్సరాలు అనేక రకాల అనారోగ్యంతో బాధ పడుతూ ఉండే వాడు. ఇంగ్లీష్ మందులు అతనికి పని చేయకపోతే, ఎక్కడెక్కడో తిరిగి ఆయుర్వేదం, మూలికల వైద్యుల దగ్గరికి వాడిని తీసుకు వెళ్లి చాలా ఓపికగా వాడికి వైద్యం చేయించే వారు. బాలారిష్టాలు అన్నీ దాటి వాడు చదువులో పడిన తరువాత ఆయన ఊపిరి పీల్చుకున్నారు. శారదాంబ గారి మనస్తత్వం వేరు, ఆయన మనస్తత్వం వేరు. ఆవిడ దేని గురించి పెద్దగా ఆలోచించదు. ఆయన అలా కాదు. ఆలోచనలు ఎక్కువ. మిగతా వ్యాపకాలు ఏమీ ఎక్కువ లేకపోతే ఎప్పుడు కొడుకు గురించే ఆయన ఎక్కువ ఆలోచిస్తూ ఉంటారు . పదహారు సంవత్సరాలు దాటిన తరువాత వాడిని స్నేహితుడి లాగే చూసే వారు. ఇద్దరూ కలిసి సినిమాలకి, షికార్లకి వెడుతూ ఉండేవారు.

రాజా. చదువులో ఎటువంటి కష్టాలు లేకుండా బిట్స్ పిలానీ లో బీటెక్ , అమెరికా లో ఎంఎస్ పూర్తి చేసి, ఆయన రిటైర్ మెంట్ అయిన సంవత్సరమే కెనడా లో ఒక మంచి కంపెనీ లో చేరాడు. రాజా కెనడా వెళ్లిన సంవత్సరమే ఆయన రిటైర్

అయ్యారు. ఆయన సర్వీసు ఎక్కువ భాగం ఉస్మానియా లో రీడర్ గా గడిచింది

రిటైర్ అవగానే ఆయన అమీర్ పేట లో ఉన్న ఫ్లాట్ లో సెటిల్ అయ్యారు.

ఆ తరువాత రెండు సంవత్సరాలకి తన స్నేహితుడి కుమార్తె కళ్యాణి తో వివాహం జరిపించారు . పెళ్ళికి ముందు దాకా ఎక్కడ ఉన్నా రాజా రోజు విడిచి రోజు ఫోన్ చేస్తూ తల్లి తండ్రులతో చాలా సన్నిహితంగా ఉండేవాడు. పెళ్లి అయిన తరువాత, ఆ తరువాత కూతురు పుట్టిన తరువాత అతను కాంటాక్ట్ చేయడం బాగా తగ్గి పోయింది. . అప్పుడే మొదలయింది మూర్తి రాజు గారికి కొడుకు మీద బెంగ. ఆయన ఆలోచనలు ఎప్పుడూ కొడుకు చుట్టూ తిరుగుతూ ఉండేవి.

ఒక రోజున ఏదో పని మీద ఆయన కోఠి వెళ్లి తిరిగి బస్సు లో వస్తూ ఉంటె అనుకోకుండా అతని చిన్న నాటి మిత్రుడు వెంకటరామయ్య కలిస్తే ఇంటికి ఆహ్వా నించాడు. ఆ వేళ తాను 'రామాదాసు గురువు' గారి దగ్గరికి వెడుతున్నానని ఇంకో మాటు వస్తానని చెప్పాడు వెంకటరామయ్య.

బస్సు లు మారడానికి లక్డికాపూల్ దగ్గర దిగారు ఇద్దరూ. కాఫీ తాగి వెడదామని ద్వారకాలోకి వెళ్లారు. కాఫీకి ఆర్డర్ చేసి కబుర్లలో పడ్డారు.

వెంకట రామయ్య, మూర్తి రాజు గారు ఇద్దరూ చిన్నప్పుడు హై స్కూల్ లో క్లాస్ మేట్స్. మూర్తి రాజు ఎక్కువ టైం వెంకట రామయ్య ఇంట్లోనే గడిపేవాడు. వెంకటరామయ్య ఇంటికి ఎవరెవరో సాధువులు, స్వాముల వార్లు తరచూ వచ్చేవారు.వాడి తల్లి తండ్రులతో బాటు వెంకట రామయ్య కూడా సాధువుల్ని వదల లేదన్న మాట అనుకున్నారు మూర్తి రాజు గారు కుటుంబ విశేషాలు చెప్పుకుని మిగతా మిత్రుల గురించి మాట్లాడుకుంటూ ఉండగా వెంకటరామయ్య గారికి రెండు మాట్లు ఆయన కొడుకు ఢిల్లీ నుంచి ఫోన్ చేశాడు. వాళ్ళు ఫోన్లో మాట్లాడిన దానిని బట్టి ఆయన గ్రహించింది ఏమిటంటే, వెంకటమయ్య గారిని కొడుకు బస్సుల్లో తిరగవద్దనీ, ఆటో గానీ టాక్సీ గానీ తప్ప ఎక్క వద్దనీ మరీ మరీ చెప్పడం గ్రహించారు మూర్తి రాజు గారు. మీరంటే చాలా పట్టించుకుంటున్నాడే మీవాడు అన్నాడు మూర్తి రాజు గారు. అవునయ్యా వాడు రోజూ ఇంటికి ఫోన్ చేసి ఏదో టైము లో మాట్లాడుతూ ఉంటాడు. నేను బయటికి వెళ్లానని వాళ్ళ అమ్మ చెబితే సెల్ కి చేస్తాడు. ఈ సెల్ వాడే కొని ఇచ్చాడు. ఖాళీగా ఉన్నప్పుడు ఆటో ఎందుకని బస్సు ఎక్కితే, ఫోన్ లో చప్పుడు బట్టి గ్రహించి బస్సు ఎందుకు ఎక్కారని కోప్పడుతూ ఉంటాడు. వేంకటరామయ్య గారు ఆ విషయాలు చెబుతుంటే తన కొడుకు రాజా గుర్తుకు వచ్చి కొంచెం మనసు చివుక్కుమంది. ఆయన కొడుకు ఇండియా లో ఉన్నాడు కాబట్టి వీలవుతుందేమో అనుకుని మనసు సరి పెట్టుకున్నారు.

వెంకటరామయ్య గారి ఇంకో ఇద్దరు మిత్రులు ఆయనకి ఫోన్ చేసి ద్వారకా లో ఉన్నారని తెలిసి అక్కడికి వచ్చారు. వాళ్ళ కారులో 'రామదాసు గురువు' గారి దగ్గరికి వాళ్ళు బయలుదేరుతొంటే సడన్ గ ఎందుకో మూర్తి రాజు గారికి కూడా ''రామదాసు గురువు' ని చూడాలనిపించి తానూ వస్తానని చెప్పి వాళ్ళతో పాటు కారు ఎక్కారు.

" రామదాసు గురువు' గారి గురించి ఇద్దరూ లక్డీకా పూల్ వద్ద బస్సు దిగి అక్కడ వెయిట్ చేస్తున్న ఇంకో ఇద్దరు వేంకటరామయ్య గారి  మిత్రులతో కలిసి కారు లో బయలు దేరారు.

దారిలో మూర్తి రాజు గారు వేసిన ప్రశ్నలకి వెంకట రామయ్యగారు ఇచ్చిన జవాబుల సారాంశ మేమిటంటే. రామదాసు గారు  ఒక పెద్ద కంపెనీకి చైర్మన్ గా ఉండేవారు. వారు అనుకోకుండా ఒక మాటు ఒక సాధువుని ఢిల్లీ లో కలిస్తే, ఆ సాధువు తాను పిలిపు ఇచ్చినప్పుడు రిషికేష్ రమ్మని చెప్పి వెళ్ళిపోయాడట. ఆ తరువాత ఒక మాటు కల లో కనపడి రిషికేష్ లో ఫలానా చోటికి రమ్మని ఆదేశ మిస్తే రామ దాసు గారు అక్కడికి వెళ్లడం ఆయనను కలవడం జరిగింది. ఆయన ఏమి చెప్పాడో తెలియదు, ఈయన వెనక్కి వచ్చి ఆస్తులన్నీ ఒక ట్రస్ట్ కి ఇచ్చి మిత్రులని మానేజ్ చేయమని వెనక్కి వెళ్ళిపోయాడట. అక్కడే ఎనిమిది సంవత్సరాలు ఉండి ఆ సాధువు దగ్గరే శాస్త్రాధ్యయనం చేసి గురువు సహాయం తో ఆధ్యాత్మిక ఉన్నతి సాధించారు. గురువు ఆదేశం మేరకు ఆధ్యాత్మిక సాధకులకు సహాయం కోసం చిలుకూరు అవతల ఆయన ట్రస్ట్ వారు కొన్న భూమిలో ఉన్న గృహ సముదాయం లో ఒక దానిలో ఉంటున్నారు. పబ్లిసిటీ అదీ ఏమీ ఉండదు. సాధకులు ఎవరయినా ఆయన దగ్గర సందేహాలు తీర్చుకుని సాధన కొనసాగించ వచ్చు.  వెంకటరామయ్య గారు ప్రతి ఆదివారం అక్కడికి వెళ్లడం కొద్ది  సంవత్సరాలుగా జరుగుతోంది.

పచ్చటి వృక్షాల మద్య ఉన్న గృహ సముదాయం చాలా బాగా నచ్చింది మూర్తి రాజు గారికి. అందులో ఒక దాంట్లో రాందాసు గారు పెద్ద కాంపౌండ్ ఉన్న ఇంట్లో ఉంటున్నారు. వీళ్ళు వెళ్ళేటప్పటికి ఆ ఇంటి హాలు లో ఐదారుగురు వ్యక్తులు ఒక తివాసీ మీద కూర్చున్నారు. వాళ్లకి ఎదురుగా ఒక పెద్ద కుర్చీలో ఒక స్ఫురద్రూపి అయినా వ్యక్తి కూర్చున్నారు. ఆయనే రాందాసు గురువుగారని మూర్తి రాజుగారు గ్రహించారు. ఆయన ప్రత్యేకమయిన వేషం ఏమీ లేకుండా ఒక తెల్లటి లుంగీ దాని మీద ఒక తెల్లటి పొడవాటి కాటన్ జుబ్బా ధరించి కూర్చున్నారు. ఆరడుగుల  పొడుగు ఉంటారేమేమో అనిపించింది. ఇల్లంతా చూస్తే మోడరన్ గానే ఉంది. హాలుకు ఒక్క పక్క గా టీవీ దాన్ని ముందర కొన్ని కుర్చీలు ఉన్నాయి. మూర్తి రాజు గారు మిగతా వాళ్ళ తో బాటు ఆయనకి ఎదురుగా కూర్చున్నారు. రామదాసు గారు మూర్తి రాజు గారి కేసి చూసి పలకరింపుగా నవ్వేరు. ఆయన కళ్ళల్లో చూసిన ఆర్ద్రత , నవ్వులో ఆప్యాయత మూర్తి రాజు గారిని ముగ్దుణ్ణి చేసింది. ఏ మాత్రం పరిచయం లేక పోయినా ఎవరో ఆత్మా బంధువుని కలిసిన భావన ఆయనకీ కలిగింది.

మిగతా వాళ్ళు ఏవేవో ప్రశ్నలు వేస్తె అన్నిటికీ సమాధానాలు చెప్పి అవసరమయిన చోట తగిన సలహాలు ఇచ్చారు గురువుగారు. రెండు  గంటలయిన తరువాత ఒకతను వచ్చి సంజ్ఞ చేస్తే గురువు గారు లేచి పక్కనున్న పొడవు పాటి వసారా లోకి నడిచారు అందర్నీ రమ్మని చెయ్యి చూపుతూ. అక్కడ నీట్ గా స్నాక్స్ ఆరెంజ్ చేసి ఉన్నాయి. ఆ పక్కనే కాఫీ టీలు కూడా పెట్టారు. స్నాక్స్ తీ సుకోవడం అయిన తరువాత వెంకట రామయ్య గారు మూర్తి రాజు గారిని పరిచయం చేశారు. మామూలు విషయాలు అడిగిన తరువాత, సమస్యలు ఏమన్నా ఉన్నాయా అని అడిగితే, ఏవీ లేవని చెప్పినప్పుడు  ఆధ్యాత్మికంగా ఏదయినా సాధన చేస్తున్నారా అని అడిగారు మూర్తి రాజు గారిని.  ప్రత్యేకం గా ఏమీ చేయటల్లేదు అని చెబితే రోజూ భాగవతం చదవమని, వీలయినప్పుడల్లా ఇష్ట దైవానికి పూజ చేయమని సలహా ఇచ్చారు. పూజ చేయడం కుదరనప్పుడు మానసికంగా పూజ

చెయ్య మన్నారు. ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు తన దగ్గరికి రమ్మన్నారు.

ఆ తరువాత ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా రాందాస్ గురువుగారి దగ్గరికి వెళ్లడం జరుగుతూనే ఉంది. వాస్తవానికి ఆయన ఆదివారం కోసం ఎదురుచూసే వారు. గురువు గారి దగ్గర ఉన్న కాల మంతా చాలా ఆనందంగా గడిచేది. ఆయన సలహాప్రాకారం మానసిక పూజ చేయడం, భాగవతం చదవడం ప్రారంభించారు. ఇప్పుడు ఆయనకీ ఒకటే సమస్య. పూజ చేస్తున్నపుడూ, భాగవతం చదువుతున్నప్పుడూ కొడుకు మీద ఆలోచనలు పోవడం, వాడు ఫోన్ చేయడం తగ్గించడం అదీ గుర్తుకు వచ్చి కొంచెం ఇబ్బంది గా ఉండేది. ఒకటి రెండు మాట్లు గురువు గారి దగ్గర సమస్య చెబితే ఆయన అన్నారు.

మీ అబ్బాయి ఫోన్ చెయ్యకపోవడం తప్ప అతని గురించి ఇంకే విషయం మిమ్మల్ని కలత పెడుతోంది? చిన్నప్పుడు నా మీద చాలా ఆధార పడేవాడు. స్కూల్ లో ఏ సమస్య లొచ్చినా నాతో చెప్పుకుని పరిష్కారం అడిగేవాడు.

సమస్యలంటే?

స్కూల్ లో ఉన్నప్పుడు ఇతర విద్యార్థుల నుంచి పోటీ ని ఎదుర్కోవడం, వక్తృత్వ పోటీలలో సలహాలు, టీచర్లు అనవసరం గా అవమానించడం వంటివి. అదే వరస కాలేజ్ లోనో, యూనివర్సిటీ లోనూ కూడా కంటిన్యూ అయింది. ఉద్యోగంలో చేరిన కొత్తలో కూడా తరుచు మాట్లాడి విషయాలు చెబుతూ ఉండేవాడు

మీరు ఎం చేసే వారు ?

తగిన సలహాలు ఇస్తే వాటిని అమలు చేసి వాడు ఇప్పుడు అతనికి ప్రస్తుత పరిస్థితుల్లో మీ సలహాలు అవసరం లేదేమో?

అవసరం లేకపోయినా, తన ఆఫీసు లో కెరీర్ విషయాలు కానీ, నా ఆర్థిక అవసరాలు గురించి కానీ కనీసం ప్రస్తావించక పోతే అదేదో బాధగా ఉంటుంది.

ఆయన మాటలు విని గురువు గారు సానుభూతి గానే స్పందించి ఒకటి చెప్పారు.

" ఇప్పటి అతని జీవన సరళి మీకు తెలియదు కదా? మీతో ఎక్కువ మాట్లాడ పోవడానికి తగిన కారణాలు ఉన్నాయేమో? మీరు మానసిక పూజ శ్రద్ధగా చేస్తూ, రోజూ కొద్ది సేపు నేను చెప్పిన విధం గా ధ్యానం చేయండి .. ఇవన్నీ చేస్తే ఆ ఆలోచనలు

ఎక్కువ బాధించవు" అని చెప్పారు.

అయినా పెద్ద ఫలితం లేకపోయింది మూర్తి రాజు గారికి గురువు గారి దగ్గరికి వెళ్లడం ప్రారంభించిన ఆరు నెలలకి రాజా ఆఫీసు పని మీద ఇండియా వచ్చాడు. కళ్యాణి, మనవరాలు రెండు రోజులు ఉండి వైజాగ్ పు ట్టింటికి వెళ్లారు . రాజా ఆఫీసు పని అయిన తరువాత ఇంకో నాలుగు రోజులు సెలవు పెట్టి తల్లితండ్రులతో గడిపాడు. అతను ఉన్నన్ని రోజులో చాలా బాగా గడిచింది. ఇంకో రెన్డు రోజులకి తిరిగి వెడతాడనగా మూర్తి రాజు గారు కొడుకుని గురువు గారి దగ్గరికి తీసుకు వెళ్ళాడు. రాజాకి కూడా గురువు గారు చాలా బాగా నచ్చారు. ఆ ప్రదేశం బాగా నచ్చింది. మూర్తి రాజు గారు మిగతా మిత్రులతో హెర్బల్ గార్డెన్ చూడడానికి వెడితే రాజా, రామదాసు గురువు గారి తో సంభాషిస్తూ ఉంది పోయాడు.

రాజా ఉన్న అన్ని రోజులూ చాలా బాగా గడిచింది. సమయం చూసి శారదాంబ గారు రాజా తో చెప్పింది " నాన్న గారు నీ ఫోన్ కోసం చూస్తూ ఉంటారు. కల్యాణి చేస్తున్నా నువ్వు కూడా అప్పుడప్పుడు చేస్తూ ఉండమని" రాజా అలాగే అని నవ్వి ఊరుకున్నాడు. కల్యాణి కొన్నాళ్ళు వైజాగ్ లో ఉండి వస్తానంటే రాజా ఒక్కడూ వెళ్ళిపోయాడు. ఆ తరువాత కల్యాణి మానవరాలుతో వచ్చి రెండు రోజులు ఉండి సిడ్నీ వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్లిపోయింతరువాత మళ్ళీ మామూలే. రాజా సరే, ఉద్యోగం లో చేరడంతో కల్యాణి దగ్గరనుంచి కూడా ఫోన్లు తగ్గిపోయాయి.

వారం వారం గురువు గారి దగ్గరికి వెడుతూనే ఉన్నారు మూర్తి రాజు గారు. అలా ఒక మాటు వెళ్లి నప్పుడు గురువు గారు ఒక సలహా ఇచ్చారు. ట్రస్ట్ ఇళ్లల్లో ఒకటి ఖాళీ గా ఉందని, అమీర్ పేట ఫ్లాట్ అద్దెకు ఇచ్చేసి తనకి దగ్గరగా వచ్చేయమని. ఇక్కడ అద్దె నామ మాత్రమే. అద్దె కంటే గురువు గారి దగ్గరికి వచ్చి దగ్గ రగా ఉండే అవకాశానికి మూర్తి రాజు గారు చాలా ఆనంద పడ్డారు. బయటి నుంచి వచ్చే వాళ్లతో ఫార్మల్ గా సత్సంగం ప్రతి ఆదివారారం జరిగినా, ట్రస్ట్ భవనాల కాంప్లెక్స్ లో ఉండేవాళ్ళు ప్రొద్దున, సాయంత్రం ఒక గంట గురువుగారి సమక్షం లో గడపడం కద్దు. అలా కలిసినపుడు వ్యక్తిగత సమస్యలనుంచి, లోతయిన ఆధ్యాత్మిక విషయాల మీద ఏ ప్రశ్నలయిన గురువుగారిని అడిగి సమాధానాలు పొందుతూ ఉంటారు. కావలసిన వాళ్లకి వ్యక్తిగతమ్ గా కలిసే అవకాశం కూడా కల్పిస్తారు. అలా కలిసినప్పుడే మూర్తి రాజు గారు తన కొడుకు విషయం మాట్లాడుతూ ఉంటారు. ఆయన కి ఆద్యాత్మికం గా ఇంకా సందేహాలు ఉత్పన్నం కాలేదు. ఎంతసేపూ ఆలోచనలు కొడుకు చుట్టూనే.

*********

సత్సంగం టైం అవడంతో బాగవతాన్ని పక్కన పెట్టి లేచారు మూర్తిరాజుగారు. ఒక గంట సేపు జరిగే ఆ సత్సంగాన్ని ఆయన ఎప్పుడూ వదులు కోరు.

మూర్తి రాజు గారి ఇంటికి, గురువు గారి ఇంటికీ మధ్య అయిదు ఆరు ఇళ్లు మాత్రమే ఉన్నాయి. ఆయన ఇంటికి మూడో ఇంట్లో మురళి ఉంటున్నాడు. అతను కూడా మంచి మిత్రుడు . అతని ఇంటి దగ్గరికి వచ్చేటప్పటికి, సిట్ అవుట్ లో మురళి కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్నాడు. ఈయన అక్కడికి రాగానే, మురళి నాలుగేళ్ల కొడుకు పరుగెత్తుకుని వచ్చి తండ్రి ఒళ్ళోకి ఎక్కాడు. అతను చిరాగ్గా అతన్ని దింపి లోపలి పొమ్మన్నాడు. ఒక్క క్షణం ఆగి మూర్తి రాజు గారు అది గమనించారు. "ఏమనుకోకు మురళీ. వాడిని అలా విదిలించకు. మహా అయితే ఇంకో రెండు మూడేళ్లు మాత్రమే వాడి ఆలింగన పరిశ్వంగం ఆనందించ గలవు. వాడు కొంచెం పెద్ద అయితే కావాలన్నా అది కుదరదు." అన్నారు నవ్వుతూ. ఏమనుకున్నాడో, మురళి వెంటనే కొడుకుని దగ్గరకి తీసుకుని వొళ్లో కూర్చోపెట్టుకున్నాడు.

ఆ వేళ సత్సంగం అయిన తరువాత అందరూ వెళ్ళిపోయిన తరువాత గురువు గారి దగ్గరే కూర్చుంది పోయారు మూర్తి రాజు గారు. రాందాసు గురువుగారు కొంచేము సేపు లోపలి వెళ్లి మెయిల్స్ అవీ చూసుకుని మళ్ళీ వచ్చి కూర్చున్నారు.

" ఎలా ఉంది మీ భాగవతం పఠనం ? ధ్యానం కొంచెం సేపు అయినా చేస్తున్నారా? ఆలోచనలు ఏమయినా బాధిస్తున్నాయా ?" అన్నారు మూర్తి రాజు గారి కేసి చూసి

" రాజా ఆలోచనలే ఎక్కువ గా వస్తూ ఉంటాయి. ఈ మధ్యన బొత్తిగా ఫోన్ చేయడం మానేశాడు. తల్లి తండ్రుల గురించి ఆలోచించకుండా, పట్టించుకోకుండా ఎలా ఉంటారో ఆశ్చర్యం గా ఉంది" అన్నారు నిష్ఠూరంగా'

గురువుగారు నవ్వుతూ " మూర్తి రాజు గారూ నాకు అనిపించే దేమిటంటే, అది మీరు విచారించ తగ్గ విషయం కాదేమో అనిపిస్తోంది. సరిగా ఆలోచించండి. మీరు వాడికి చిన్నప్పటినుంచి ఏమి చేసినా మీ తృప్తి కోసం చేశారు. ఆలా చేయకుండా మీరు ఉండలేరు కాబట్టి చేశారు. ఇప్పుడు వాడు వాడి ప్రపంచంలో ఉన్నప్పుడు, మీరు చేసినవన్నీ మరిచిపోయి వాడు నిర్లక్ష్యం చేస్తున్నాడు అనుకుంటున్నావారు. అది ఒక సహజ పరిణామం ఎందుకు అనుకోరు? ఇప్పుడు వాడు మీకంటే వాడి కూతురు గురించి ఆలోచిస్తూ ఉండవచ్చు. దానివల్ల మీ గురించి ఆలోచనలు తగ్గవచ్చు. మీ నాన్నగారి గురించి మీరు ఎంత సేపు ఇప్పుడు ఆలోచిస్తున్నారు? మీకు వయసు వచ్చిన కొద్దీ అది తగ్గింది కదా? ఏ తల్లి తండ్రులకయినా పిల్లలు అంనందం గా ఉంటె చాలుననుకుంటారు కదా?. ఇప్పుడు వాడు ఆనందం గా ఉన్నాడు కాబట్టి మీరు అసలు విచారించవలసిన అవసరం లేదు కదా?

" అవును నిజమే" అన్నారు మూర్తి రాజు గారు కొంచెం ఆలోచనలో పడి.

"మీకో రహస్యం చెబుతున్నాను. మీరు అనుకున్న దాని కంటే మీ గురించి ఎక్కువ శ్రద్ధ రాజాకి మీ పట్ల ఉంది. మీరు ఆధ్యాత్మికం లో ఎక్కువ సేపు గడపాలని అతను కిందట మాటు వచ్చినప్పుడు నాతో చర్చించాడు. మీరు అమీర్ పేట నుంచి ఇక్కడికి మారడానికి కారణం ఎవరు అనుకుంటున్నారు? ఇప్పుడు మీరు ఉంటున్న ఇల్లు అద్దెది కాదు. అతను మీకోసం కొన్నది. సమయం వచ్చినప్పుడు చెప్పమన్నాడు. అతను కాంటాక్ట్ తగ్గించడం నా సలహా మేరకే. మీకు ఆధ్యాత్మికం గా నేను అనుకున్న దానికంటే అది ఎక్కువ సమస్య అయింది కాబట్టి చెబుతున్నాను. మీరు అన్నీ వదిలేసి దైవ చింతన ఎక్కువ చేస్తే మీ రాజా, అతని భార్యా, మీ భార్యా అందరూ సంతోషిస్తారు.వాళ్లందరికీ ఇది తెలుసు" అన్నారు నవ్వుతూ

ఆ రోజు న సత్సంగం నుంచి చాలా హుషారుగా మూర్తి రాజు గారు ఆనందంగా తిరిగి రావడం గమనించిన శారదాంబ గారు, గురువు గారు ఏమి చెప్పారో ఊహించారు

సమాప్తం